ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 18, 2015

వైవిధ్యానికి నిలువుటద్దం

విజయీభవ

గట్టి.. కమ్ బ్యాక్

హీరోయిన్ అవకాశాలు 30 దాటితే తగ్గిపోయినట్టే. ఇక పెళ్లయితే మళ్లీ ఆ ముఖం కనిపించడం కష్టమే. బాలీవుడ్‌లో మరీను. సినిమాకో కుర్ర హీరోయిన్ అరంగేట్రం చేస్తూ అక్కడ గ్లామర్ ప్రాధాన్యం ఏంటో చెప్పేస్తుంటారు. కానీ, కొందరు మాత్రం అలా కాదు. తల్లులయినా హీరోయిన్లుగా హీరోయిజం చూపిస్తున్నారు. మళ్లీ తెరంగేట్రం చేసి సత్తా చాటుతున్నారు. జజ్బాతో ఐశ్వర్యరాయ్ రిటర్న్ చూసి షాక్ తిన్నవారెందరో. తల్లయిన ఐష్ ఏవో ప్రత్యేక పాత్రల్లో తప్ప ఇక పూర్తిస్థాయి హీరోయిన్‌గా కనిపించదని అనుకుంటున్న తరుణంలో ఆమె పాత్ర చుట్టూనే తిరిగే జజ్బాతో కమర్షియల్‌గాను హిట్ కొట్టింది. ఐదేళ్ల క్రితం వచ్చిన గుజారిష్ చిత్రం తర్వాత ఇదే ఆమె కమ్‌బ్యాక్. మంచి పీక్ స్టేజీలో ఉన్నప్పుడు పెళ్లి చేసుకుని తెరకు దూరమైన శ్రీదేవి చాన్నాళ్ల తర్వాత క్రాస్ ఓవర్ సినిమా ఇంగ్లిష్-వింగ్లిష్‌లో మెరిసినా, ఈ మధ్యే వచ్చిన తమిళ, తెలుగు చిత్రం 'పులి'తో కమర్షియల్ కాంపౌండ్‌లోకి మళ్లీ అడుగువేసింది. 'దిల్ వాలే' చిత్రంతో మరోసారి ప్రేమ కావ్యంలో హీరోయిన్‌గా ఓ భారీ కమ్‌బ్యాక్ ఇవ్వబోతోంది కాజోల్. చివరిసారిగా 1999లో మూడు సినిమాలతో హిట్ కొట్టిన కాజోల్ రిటర్న్ గురించే ఇపుడు బాలీవుడ్ చర్చంతా. నాలుగేళ్ల క్రితం 'బుడ్డా హోగా తేరె బాప్'లో కనిపించిన రవీనా టాండన్ రెండు సినిమాలతో గ్రాండ్ రీ ఎంట్రీ ఇవ్వబోతోంది. షబ్, శోభన 7 నైట్స్ చిత్రాలు ఈమె పాత్ర చుట్టూనే అల్లిన కథలు. వీరందరికీ కంటే ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వ్యక్తి లీసా రే. పెళ్లి, పిల్లలతో బిజీ అయిన ఆమె క్యాన్సర్‌తో పెద్ద యుద్ధమే చేసి గెలిచింది. 'ఇష్క్ ఫరెవర్'తో టచ్ అప్ చేసుకుంటున్న లీసా మాంచి సాలిడ్ పాత్రతో సత్తా చాటేందుకు ప్రయత్నాలు మొదలెట్టింది. వివిధ కారణాలతో తెరకు దూరమైన లారా దత్తా, డైసీ షా, నర్గీస్ ఫక్రీ, జరీన్ ఖాన్ వంటి వర్ధమాన తారలు కూడా మరోసారి వారి కష్టాన్ని నమ్ముకుని తళకులీనే ప్రయత్నంలో ఉన్నారు. ●

శ్రీదేవి

లారా దత్తా

ఐశ్వర్య

కాజోల్

రవీనా టాండాన్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

దసరా ఫీట్లు

పండగంటే సంబరమే. అందునా దసరా పండగంటే సరదాల సంబరాలే. కళాకారులకు, సృజనకారులకు ఆకాశమే హద్దు. వీక్షకులకు ఆనంద సాగరమే. ప్రేక్షకులను మెప్పించడంలో, కరతాళ ధ్వనులు-అభినందనలను అందుకోవడంలోనే తృప్తిని వెతక్కునే అల్ప సంతోషులు కళాకారులు. ఇక సామాన్యుల సంగతి. వీరివి పెద్ద పెద్ద కోరికలేం కావు. కొత్త బట్టలు, పిండివంటలు, సినిమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వుంటే చాలు. పండగ శోభంతా వారి కళ్లల్లోనే కనిపిస్తుంది. ఆ ఆనందాన్ని ఇంటిల్లిపాదికి పంచాలనుకుంటారు. కుటుంబీకులందరికీ మరీ ముఖ్యంగా కొత్త అల్లుళ్లకు కొత్త బట్టలు తియ్యాలనుకుంటారు. తమ లేమితనాన్ని అర్థం చేసుకునే అల్లుడైతే ఫర్వాలేదు. కాకపోతే... సమస్యే. అలుగుతాడు. అటకెక్కుతాడు. అమ్మాయిని ఇబ్బంది పెట్టినా పెట్టవచ్చు. అందుకే ఇవన్నీ ఎందుకనుకున్న బీద తల్లిదండ్రులు అప్పు చేసైనా...తల తాకట్టు పెట్టయినా అల్లుడిని సంతోష పెట్టడానికే శతథా ప్రయత్నిస్తారు.

అయినా చుక్కలనంటిన ధరల ముందు చేసిన అప్పులు ఏ పాటివి! ఉప్పు పప్పుల మొదలుకొని అన్ని నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతున్నాయి. అల్లుడు ఇంట్లో వున్న నాలుగు రోజులూ విందు భోజనం పెట్టకపోయినా పప్పు పులుసైనా వడ్డించగలగాలిగా. అందుకు నానా పాట్లు...ఫీట్లు...తప్పట్లా.

⌑ ⌑ ⌑

సామాన్యులే కాదు. మన సీఎం చంద్రబాబుగారు సైతం సమస్యలతో సతమతమైపోతున్నాడు. ఫీట్లు చేయలేక తడబడుతున్నాడు. మరి రాజధాని శంకుస్థాపన ప్రక్రియే చూడండి. ప్రధాని నరేంద్రమోడీ మొదలుకొని దేశ విదేశీ పెద్దలెందరినో ఆహ్వానించాడు. వారి రవాణా, వసతి ఏర్పాట్లు ప్రోటోకాల్ తప్పకుండా చేస్తూ మెప్పించాలంటే మాటలా! వారి స్థాయికి తగ్గ ఏర్పాట్లు చేయాలని, మన గొప్పతనాన్ని ప్రదర్శించాలన్నది సీఎం కోరిక. అందుకోసం రాష్ట్రంలోని మాంచి మాంచి హోటళ్లన్నిటినీ బుక్ చేసేశాడు. అనేక రకాల వంటకాలతో మెనూలకు ఉత్తర్వులు జారీచేసేశాడు. ఇవికాక వీరందర్నీ అంపకాలు చేసేప్పుడు సమర్పించుకోవాల్సిన బహుమతులు...వగైరా...వగైరా...అన్నీ ఖర్చుతో కూడుకున్నవే. ఇకపోతే రాజధాని నిర్మాణానికి అవసరమైన భూములను ఇచ్చిన రైతు కుటుంబాలకు పట్టు వస్త్రాలు సమర్పించాలని ఆలోచన. వారి నుంచి లాక్కున్న భూములతో పోల్చితే ఈ బట్టలు ఎంతవి కాని... వాటినీ సమకూర్చుకోవాల్సిందే మరి.

సామాన్యులు... పేదవారు... పాలకుల పుణ్యమా అని...నిత్యం అనివార్యంగా ఎదుర్కొనే సమస్యలే అవి. బాబుగారు పనికట్టుకొని తగిలించుకున్న సమస్యలివి. శంకుస్థాపనకు అంత మంది వివిఐపిలను ఎవరు ఆహ్వానించమన్నారు? అంతర్జాతీయ ప్రచారానికి అంత ఖర్చు ఎవరు చేయమన్నారు? అదరగొట్టే ఆర్భాటానికి ఎవరు పొమ్మన్నారు? ప్రజల సొమ్మును పెద్ద ఎత్తున ఖర్చు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా వుండాలన్న ఆలోచన వుండొద్దూ! ■

◆ మనలో మాట



టపా

రిక్షావాలా స్ఫూర్తి

జీవ జాతిని రక్షించడం మన బాధ్యత. జీవజాతి రక్షణ, మనుగడను తెలియజేయుటకు రిక్షా పుల్లర్లుగా వారి జీవితాన్ని సాగించడం నిజంగా అభినందించదగ్గ విషయం. కొన్ని జీవితాలు వడ్డించిన విస్తరాకు వంటివి. బాల సరస్వతి గారి జీవితం. రాణి వాసాలు, రాజులు గతించితే రాణి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో బాల సరస్వతి జీవితం చూస్తే అర్థం అవుతుంది. ఇటువంటి గాయకులను ప్రభుత్వం ఆదుకోవాలి. సముద్ర గర్భంలో చిత్ర విచిత్రమైన జీవ జాతులు ఎన్నో ఉన్నాయి. అమ్మంటే ఇష్టం కథ చాలా బాగుంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాల వలస, శ్రీకాకుళం జిల్లా

గుడ్డు వెరీ గుడ్డే

కోడి గుడ్డుతో ముడిపడిన విశేషాలు, వినోదాల సమాహారం వెరీ గుడ్డూ. వ్యాసం ద్వారా చాలా విషయాలు తెలిశాయి, కోడిలో గుడ్డు పరిణామం చెందే ప్రక్రియ తెలుసుకున్నాం. గుడ్డులోని పోషకాల గురించి తెలిశాయి. నవ్వుల్-పువ్వుల్ బాగా నవ్వించాయి. తొలి తరం గాయని బాల సరస్వతి గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆమె చివరి దశ గురించి తెలుసుకొని చాలా బాధపడ్డాం. ప్రభుత్వం ఇటువంటి వారికి చేయూతనివ్వాలని కోరుకుంటున్నాం. అమ్మంటే ఇష్టం కథ గుండెకు హత్తుకునేలా ఉంది. కూత వేటు దూరంలో కవిత ఆలోచింపచేసే విధంగా ఉంది.

కైపు ఆదిశేషారెడ్డి, అల్లీపురం, నెల్లూరు

మరు భూమి

రణ రంగం కాని చోటు భూ స్థలమంతా వెదికిన దొరకదు.. గతమంతా తడిసే రక్తమున కాకుంటే కన్నీళ్లతో... అన్నాడు శ్రీశ్రీ. ప్యారిస్ ఎన్నో ఏళ్ల చరిత్రను తన కాల గర్భంలో కలుపుకున్నది. యుద్ధాలు, వ్యాధులు, కరువు వంటి ఎన్నో మృత్యు క్రీడల వల్ల కొన్ని లక్షల మంది మరణించడం, ఆ చరిత్ర కళ్లకు కట్టేలా వారి అస్థికలను మ్యూజియంగా మార్చిన తీరు అద్భుతం. రోబో రెస్టారెంట్ ఆశ్చర్యపరిచింది.

రాము, కడప

పోషకాల గని

గుడ్డు పోషకాల గని వంటిది. అందులో ప్రోటీన్లు, కాల్షియం వంటివి చాలా ఉంటాయి. గుడ్డు పరిణామ క్రమం గురించి చాలా బాగా వివరించారు. అలాగే గుడ్డుతో ఆడే వింత వింత ఆటలు, సంబరాలు గురించి తెలుసుకున్నాం. పశు సంవర్ధక శాఖ ప్రతి ఏడు గుడ్డు గురించి ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో ఉండే అపోహలు కొంతైనా తొలగుతాయి. కార్టూన్లకు వయసైతే.. చాలా బాగుంది. టామ్ అండ్ జెర్రీ, గూఫీ, రోడ్ రన్నర్, కొయోట్ వంటి కార్టూన్ల గురించి తెలుసుకోవడం బాగుంది.

రామకృష్ణ, నందలూరు, కడప

అన్నీ బాగున్నాయి

ఈ వారం నవ్వుల్-పువ్వుల్, కార్టూన్లూ చాలా బాగున్నాయి. బాల సరస్వతి వంటి మహా గాయనీమణుల జీవితాల గురించి చాలా విషయాలను నేర్చుకున్నాం. మనిషి సాధించలేనిదంటూ ఏమి ఉండదు అన్ని చెప్పడానికి ఉదాహరణగా జెరూపుని సూచించవచ్చు. సొంతంగా విమానం తయారుచేసుకోవడం నిజంగా అద్భుతం.

కోటి, ప్రకాశం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

విజయీభవ

కవర్ స్టోరీ ——— 6

దసరా! భారతీయులు జరుపుకునే అతి ముఖ్యమైన పెద్ద పండుల్లో ఒకటి. దేవీ నవరాత్రులు పేరుతో తొమ్మిది రోజుల పాటు చేసుకునే పండుగ దసరా. చివరిగా విజయదశమితో ముగింపు పండుగ జరుపుకుంటారు. విజయదశమి విజయాన్ని లేదా విజయం సాధించాలన్న ఆకాంక్షను సూచిస్తుంది. చెడు మీద మంచి సాధించే విజయం కావొచ్చు. నిరక్షరాస్యత మీద అక్షరాస్యత సాధించే విజయం కావచ్చు. వెనకబాటు తనం మీద అభివృద్ధి సాధించే విజయం కావచ్చు. ఎందుకలోనైనా మనిషి విజయాన్ని కోరుకుంటాడు. మొత్తంమీద ప్రకృతిపై మానవుడు సాధించిన విజయానికి సంబంధించిన పండుగ.

స్ఫూర్తి .... సెల్ఫీతో ప్రయాణం	3
వినూత్నం .... అందమంటే యాటిట్యూడే	4
కార్టూన్ పంచ్	5
ప్రత్యేకం .... రైట్... రైట్...	10
నవ్వుల్ పువ్వుల్	11
సినిమా కబుర్లు .... వైవిధ్యానికి నిలువుటద్దం	14
వింత లోకం .... నిమిషానికి 20 తుమ్ములు	16
కవిత్వమ్ .... ఆ తల్లులకు మోకరిల్లుతున్నాను! వారే నా గురువులు	17
కథ .... పిసినిగొట్టు	18
రుచి .... పాల ముంజలు	21
బాల నేస్తాలు .... కత్తిరించి అతికించండి	22
లఘు చిత్రమ్ .... గచ్చిబౌలి	24



చూద్దామా -12
పాలరాతి కల

సెల్వీతో ప్రయాణం

ఆమెకు అప్పుడు పద్దెనిమిదేళ్లు. మామూలుగా అయితే రంగు రంగుల కలలు కనే వయసు. అయితే ఆమె చుట్టూ చిక్కటి చీకటి. నిండా నిరాశా నిస్పృహలు. బతుకు మీద ఆశ ఆవగింజంత కూడా లేదు. ఆ నిర్వేదంలో ప్రాణం తీసుకోవాలని నిశ్చయించుకుంది. అందుకు జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే బస్సులను ఎంచుకుంది. తీరా రోడ్డు మీద బస్సు ఎదురుగా వస్తున్నప్పుడు ... హఠాత్తుగా ఆమెలో ఒక ఆలోచన వచ్చింది. 'చచ్చి ఏం సాధిస్తాను? బతికి నన్ను నేను నిరూపించుకోవాలి' అనుకుంది. ఏ బస్సు కిందైతే పడి అర్ధంతరంగా జీవితాన్ని చాలించాలనుకుందో... చెయ్యెత్తి అదే బస్సులో టిక్కెట్ కొని ప్రయాణం ప్రారంభించింది.

చిన్న వయసులోనే చావు గురించి ఆలోచించిన ఆ అమ్మాయి పేరు సెల్వి. కర్నాటకలో ఓ పేదింట పుట్టి పెరిగింది. పట్టుమని పద్నాలుగేళ్లు కూడా నిండక ముందే... పెళ్లంటే ఏంటో తెలీని ఆ పసిదానికి... ఓ తాగుబోతుతో వివాహమైంది. చెవి దిద్దులు, కొద్ది పాటి సామాను ఇచ్చి అత్తవారింటికి పంపి తమ భారం దింపుకున్నారు తల్లిదండ్రులు. చిన్నదానికి అక్కడ ఊహించని కష్టాలు ఎదురయ్యాయి. తాగి ఇంటికొచ్చిన భర్త ఆమెను విచక్షణా రహితంగా కొట్టడం, నోటికి వచ్చినట్టు తిట్టడం, చెప్పకూడని విధంగా మసలుకోమనడం, మరింత కట్నం తీసుకురమ్మనడం... ఇలా నాలుగేళ్లు గడిచాయి. ఆ నరకంలో ఒక్క నిముషం కూడా వుండలేననిపించి...ఇంట్లోంచి పారిపోయింది. మైసూర్‌లో మహిళల కోసం ఏర్పాటు చేసిన 'ఒదనాడి' ఆశ్రమంలో చేరి డ్రైవింగ్ పాఠాలు నేర్చుకుంది. అదీ అతి తక్కువ కాలంలోనే. అలా కర్నాటకలో తొలి మహిళా క్యాబ్ డ్రైవర్‌గా రికార్డు సృష్టించింది.

ఎన్నో మలుపులు...

స్టీరింగ్ పట్టిన సెల్వి కారునే కాదు. జీవితాన్ని కూడా సరైన మార్గంలో నడపడంలో మంచి నేర్పరినని నిరూపించుకుంది. అంతేకాదు. పెళ్లయి భర్తను విడిచిపెట్టిన ఆ అమ్మాయిగా తనకు అప్పటి వరకు వున్న పరిమితులను చెరిపేసింది. మనసుకు నచ్చిన అబ్బాయిని పెళ్లాడింది. ముచ్చటైన ఆ జంటకు ఇద్దరు ముద్దులొలికే చిన్నారులు. తన జీవితంలో ఎదురైన చేదు ఘటనలేవీ వారి ఛాయలకు కూడా రాకూడదన్నదే ఆమె పట్టుదల. వారికోసమే తన కష్టమంతా. తన చిన్నారి కూతుర్ని పెద్దయ్యాక పైలెట్‌గా చూడాలని ఆశపడుతోంది. ఇప్పుడు.... క్యాబ్ మాత్రమే కాదు. బస్సు, ట్రక్కు కూడా నడిపేస్తుంది. సొంతగా క్యాబ్ సెంటర్ కూడా ప్రారంభించింది. ఆమె కర్నాటకలో తొలి మహిళా క్యాబ్ డ్రైవర్. తొలి ట్రక్ డ్రైవర్. తొలి బస్సు డ్రైవర్.

సెల్విపై సినిమా

సెల్వి సాహస గాథ ఎందరికో స్ఫూర్తినిస్తోంది. ఎన్నో వేదికలపై తన విజయగాథను వినిపిస్తోంది. మహిళల ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా చెప్తోంది. సెల్వి కథ నుంచి కెనడియన్ దర్శకురాలు ఎలీసా ఎంతగానో స్ఫూర్తి పొందింది. లఘు చిత్రం తీయాలని నిశ్చయించుకుంది. కానీ ఆమెకు కన్నడం తప్ప మరో భాష రాదు. ఈమెకు ఇంగ్లీషు మినహా మరో భాష అర్థం కాదు. ఎలా? అన్నది సమస్య అయ్యింది. మనసుంటే మార్గం వుంటుంది కదా. అలా వచ్చినదే 'డ్రైవింగ్ విత్ సెల్వి'. ఈ షార్ట్ ఫిల్మ్‌తో సెల్వి స్ఫూర్తి ఖండాలను దాటింది. లండన్‌లోని 'రెయిన్ డాన్స్ ఫెస్టివల్'లో సైతం ఆ స్ఫూర్తిదాయక చిత్రం ప్రదర్శితమై ఆహుతులను ఆకట్టుకుంది. అలా ఆమె విజయగాథ దేశదేశాల వారికి చేరుతోంది.

విస్ఫూర్తం

అందానికి నిర్వచనం మార్చేస్తోంది సూపర్ మోడల్ విన్నీ హార్లో. తీరుకు మించిన ఆకర్షణ లేదంటోందీ స్పోక్స్‌మోడల్. అదేనండి ఆత్మాభిమానానికి ప్రతినిధి కాస్త తన మోడలింగ్‌తో ప్రతిబింబంలా పదం మార్చుకుంది. విటిలిగో తెలుపు నలుపుల్లో చర్మాన్ని మారిస్తే ఆత్మవిశ్వాసంతో వాటినే బ్యూటి ప్యాచెస్‌గా తీసుకుని రంగుల ప్రపంచంలో తారలా వెలగొందుతోంది.

అందమంటే యాటిట్యూడే

జమైకా నల్లజాతికి చెందిన చాంటెల్లె బ్రౌన్ యంగ్ అనే కెనడా యువతే విన్నీ హార్లోగా ఫ్యాషన్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న సూపర్ మోడల్. తన దృఢమైన వ్యక్తిత్వంతో రోల్‌మోడల్‌గాను నిలుస్తోంది.. అందం విషయంలో కుంగిపోయే వారికి. అందంగా లేమని ముఖం చూపించడానికి ఇబ్బంది పడుతూ, జన్మత వచ్చిన రూపంతో నలుగురిలో తిరగడానికి సందేహిస్తూ తమను తామే ఆత్మవంచన చేసుకునే వారికి తన విజయం ద్వారా తిరుగులేని పాజిటివ్ డోస్‌ను మందు వేస్తోంది. విన్నీ హార్లోగా మారక ముందు ఆమె ఎన్నో అవమానాల్ని ఎదుర్కుంది. నాలుగేళ్ల వయసు నాటికి విటిలిగో సమస్య తలెత్తి ఒళ్లంతా తెల్లని మచ్చులు, ప్యాచ్‌లు వచ్చాయి. అంత త్వరగా నయం కాని ఈ చర్మ సమస్య చాంటెలేని సోషల్ లైఫ్‌కి దూరం చేసింది. తోటి విద్యార్థుల వెక్కిరింతలతో అనేక పాఠశాలల్ని మారింది. ఎక్కడికి వెళ్లినా అవే అవమానాలు పదేపదే ఎదురవడంతో చదువు మధ్యలోనే మానేసింది. పూర్తిగా ఇంటి పట్టునే ఉండిపోయి తన లోకంలో తానే గడి పేది. ఈ జీవితానికి విసిగిపోయిన ఆమె అసలు తన లోపమంతా తాను తనను చూస్తున్న వైఖరిలోనే ఉందని గమనించింది. అస్సలు అందానికి కొలమానాలేంటని ప్రశ్నించుకుంది. ఆమెను ఆమె ప్రేమించుకోవడం మొదలెట్టింది. ఎప్పుడైతే తనను తాను మంచి అందగత్తెను, వ్యక్తినని పూర్తిగా నమ్మిందో అప్పటి నుంచే తన కలలతో రాజీ పడేది లేదని నిశ్చయించుకుంది. తాను అవమానాలు ఎదుర్కున్న అందానికి సంబంధించిన రంగంలోనే ఎదిగి అందరి నోళ్లు మూయించాలని సంకల్పించింది.

నేను... నాలా...

దానిలో భాగంగానే తాను దిగిన సెల్ఫీల్ని ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టేది. ఆ ఫొటోల్లో ఆమె ఆత్మవిశ్వాసం, విలక్షణత ప్రతిబింబించడంతో లైక్‌ల మీద లైక్‌లు వచ్చేవి. అలా, యూట్యూబ్ వీడియోల సెలబ్రెటీ అయిన షానన్ బోడ్రామ్ దృష్టిలో పడింది. చాంటెలే జీవితానికి అద్దం పట్టేలా బోడ్రామ్ 'నేచురల్ మి' అనే వీడియో తీసి యూట్యూబ్‌లో ఉంచాడు. దానికి ఏకంగా 15 లక్షల లైక్‌లు రావడంతో చాంటెలే కథ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్నో మాధ్యమాలు ఆమె ఇంటర్వ్యూలు తీసుకున్నాయి. వీటి ద్వారా ఫ్యాషన్ ఐకాన్ టైరా బ్యాంక్స్ చాంటెలేను సంప్రదించింది. ప్రపంచాన్ని ఊపేస్తున్న 'అమెరికాస్ నెక్స్ట్ టాప్ మోడల్' అనే మోడలింగ్‌కు సంబంధించిన టీవీ షోలో పాల్గొనేలా వెన్నుతట్టింది. ఆ షో ద్వారా మరింత ఇమేజ్‌ను పెంచుకున్న చాంటెలే విన్నీ హార్లోగా మోడలింగ్ ప్రస్థానాన్ని ప్రారంభించింది. న్యాయనిర్ణేతలు ఆదిలోనే విన్నీని ఇంటికి పంపగా ఊహించని జనాదరణ, పబ్లిక్ ఓటింగ్ వల్ల మళ్లీ షోలోకి వచ్చి టాప్ లిస్ట్‌లో చేరింది. ఒకప్పుడు చిన్న చిన్న మోడలింగ్ కంపెనీలు విన్నీ ముఖంపై తలుపులేస్తే, ఆ షో తర్వాత ఎన్నో ప్రఖ్యాత, దిగ్గజ కంపెనీలు మోడలింగ్ కాంట్రాక్టులు కుదుర్చుకునేందుకు విన్నీ ఇంటికి క్యూ కట్టాయి. మోడల్సే ఎదురుచూసే బ్రాండ్‌లకే అంబాసిడర్‌గా మారి తనను హేళన చేసిన వారందరికీ వాస్తవాన్ని రుచి చూపింది. ఇదే కాక పాపులర్ పాప్ సింగర్ ఎమినెమ్‌తో కలిసి 'గట్స్ ఓవర్ ఫియర్' అనే ఆల్బమ్‌లో నటించింది. గాలా స్పా అవార్డు ఆమెను బ్యూటీ ఐడల్‌గా ఎంచుకుంది. ఎన్నో ఫ్యాషన్ మేగజీన్ల పతాక చిత్రాలకెక్కిన ఆమె ప్రతి వ్యక్తిలో ప్రత్యేకత ఉందని, అదే వారి నిజమైన అందమని చెబుతోంది. ఒకప్పుడు చులకన భావంతో ఆత్మహత్య పరిస్థితుల వరకు వెళ్లిన విన్నీ ఇప్పుడు తన ఇమేజ్‌ను ఓ మంచి లక్ష్యం కోసం ఉపయోగిస్తోంది. సామాజిక మాధ్యమాలు, చైతన్య వేదికల ద్వారా ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసాలపై కార్యక్రమాలు రూపొందిస్తోంది. తనలా విటిలిగోతో బాధపడేవారే కాక శారీరక వైకల్యం ద్వారా కుంగిపోతున్న వారికి ప్రేరణగా నిలుస్తోంది. తమను తాము అంగీకరించగలిగితే ప్రపంచమూ అలాగే స్పందిస్తుందనే విన్నీ మాటలే కాక చేతలతోను స్ఫూర్తివంతమైన కెరీర్ పయనాన్ని సాగిస్తోంది.



కార్టూన్ పంచ్


చెయ్యి ఖాళీ లేదు తర్వాత రండి!!
శంకుస్థాపన


దాద్రి ఘటనపై పెదవి విప్పని మోడీ


తొందరగా కోలుకోవాలి ఆశిస్తున్న!!
YSRCP
జగన్ దీక్ష భగ్నం


జనాల మీద పోయడానికి ఈజీగా ఉంటుందని ఈ సైజ్ ఆర్డర్ ఇచ్చా సార్!!
INK
శివసేన

ఏర్పాట్లన్నీ మన పద్ధతుల్లో ఉండాలి!!
RSS
గంగాధర్

దసరా! భారతీయులు జరుపుకునే అతి ముఖ్యమైన పెద్ద పండుగల్లో ఒకటి. దేవీ నవరాత్రులు పేరుతో తొమ్మిది రోజుల పాటు చేసుకునే పండుగ దసరా. చివరిగా విజయదశమితో ముగింపు పండుగ జరుపుకుంటారు. విజయదశమి విజయాన్ని లేదా విజయం సాధించాలన్న ఆకాంక్షను సూచిస్తుంది. చెడు మీద మంచి సాధించే విజయం కావొచ్చు. నిరక్షరాస్యత మీద అక్షరాస్యత సాధించే విజయం కావచ్చు. వెనకబాటు తనం మీద అభివృద్ధి సాధించే విజయం కావచ్చు. ఎందులోనైనా మనిషి విజయాన్ని కోరుకుంటాడు. మొత్తం మీద ప్రకృతిపై మానవుడు సాధించిన విజయానికి సంబంధించిన పండుగ. ముఖ్యంగా వ్యవసాయంలో మానవుడు సాధించిన విజయాలతో ఇది ముడిపడి వుంది. ఇలా అనేక రకాల విజయాలను అన్వయించే పండుగ దసరా. అంతేకాదు. దసరా రోజుల్లో అమ్మవారిని వివిధ రూపాలలో కొలుస్తారు. ఆ రూపాలన్నీ ఆయా సంపదలను లేదా ఆయా విజయాలను సూచిస్తాయి.

విజయీభవ

- కె. దర్శిత

దసరాను కాస్త అటూ ఇటూ చేస్తే సరదా అవుతుంది. దసరా అంటేనే సరదాలు, సంప్రదాయాలు, ఆటపాటలు, వినోదాలు మేళవించిన పండుగ. పది రోజుల పాటు దేశవ్యాప్తంగా సంతోష సంభ్రమాలతో జరుపుకునే పండుగ. దసరా వేషాలు ప్రత్యేక ఆకర్షణ. వివిధ రకాల దేవుళ్ల వేషాలు వేసి ఇంటింటికి తిరిగి పైకం పుచ్చుకోవడం కొందరి వృత్తిగా వుంది. వీటినే పగటి వేషాలు అని కూడా అంటారు. ఇప్పుడంతగా కనిపించడం లేదుగానీ... ఇదివరలో ప్రాథమిక పాఠశాలలో పని చేసే మాష్టార్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మామూళ్లు పుచ్చుకోవడం మామూలు. వెదురు కర్రతో చేసిన రంగు కాగితాలతో అలంకరించిన బాణాలు పట్టుకున్న విద్యార్థులు అయ్యవారి వెంట వెళ్లి...ఏదయా మీ దయా మా మీద లేదు. ఇంత సేపుంచుటా ఇది మీకు తగునా... అయ్యవారికి చాలు అయిదు వరహాలు. పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు అంటూ రాగయుక్తంగా పాడేవారు. అయ్యవారికి ధన రూపంలోనూ, పిల్లలకు పప్పు బెల్లం రూపంలోనూ కానుకలు ఇచ్చేవారు. ఇక పులివేషాలు సరేసరి. ఇన్ని అంశాలతో ముడిపడిన దసరా పండుగను వివిధ రాష్ట్రాలలో ఎలా జరుపుకుంటారో చూద్దాం.

మన రాష్ట్రంలో ...

దసరా పండుగను ఆశ్వయుజ శుద్ధ పాఢ్యమి నుంచి శుద్ధ నవమి వరకు తొమ్మిదిరోజుల పాటు జరుపుకుంటారు. తొమ్మిది రోజులను నవరాత్రులుగా, పదవ రోజును విజయదశమి కలిపి దసరాగా అభివర్ణిస్తారు. ఇంద్రకీలాద్రిపై దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. అమ్మవారికి రోజుకో అలంకారం చేసి పూజలు నిర్వహిస్తారు. అయితే కొన్ని జిల్లాలు దసరా ఉత్సవ విషయంలో తమదైన ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో దసరా ఉత్సవాలలో భాగంగా కళారాలను ఊరేగిస్తారు. వీటిని చక్కగా అలంకరించి సిద్ధం చేస్తారు. ఇక్కడ కాళికాదేవికి, మహిషాసుర మర్ధినికి, నరసింహస్వామికి కళారాలున్నాయి. వీటికి ఈ తొమ్మిది రోజులు విశేషంగా పూజలు చేసి ఊరేగిస్తారు. కళారాన్ని బండి మీద ఎక్కించి కొయ్యలను అమర్చి వాటి సాయంతో కళారాన్ని ఊపుతూ డప్పుల మోతతో ఊరేగిస్తారు. ఊరి నడిమధ్యకు తీసుకువచ్చి అక్కడ రాక్షస సంహారం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. విజయనగరంలో దసరా సమయంలో పైడి తల్లి పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా అడవి నుంచి ఒక చెట్టును నరికి తీసుకొచ్చి మొదలు భాగాన్ని లాగుడు బండికి కట్టి చివరి భాగంలో ఊయల కట్టి అందులో పూజారిని కూర్చోబెట్టి ఊరేగిస్తారు. ఈ ఉత్సవం చూసేందుకు చుట్టుపక్కల పల్లెటూళ్ల నుంచి ప్రజలు ఎడ్లబండిలో వచ్చి రోడ్ల పక్కన గుడారాలు వేసుకొని ఉత్సవం చూసి ఆనందిస్తారు. దసరా రోజుల్లో బొమ్మల కొలువులు పెట్టడం ఓ సరదా. ఇలా కొన్ని జిల్లాల్లో దసరా ఉత్సవాలను తమదైన ప్రత్యేక శైలిలో జరుపుకోవడం చూస్తుంటాం.

మైసూరు

ముంబై, హైదరాబాద్ వాసులు వినాయక చవితిని ఎంత ఉత్సాహంగా జరుపుకుంటారో కొల్‌కతా, మైసూర్ వాసులు దసరా పండుగను అంత ఆర్భాటంగా చేసుకుంటారు. రాజదర్పం ఉట్టిపడేలా ముస్తాబవుతుంది పట్టణం. విద్యుద్దీప కాంతులతో బంగారు వర్ణంలో ధగధగలాడే రాజభవనాన్ని

చూడ్డానికి రెండు కళ్లు చాలవు. మైసూరు మహారాజుల కాలం నుంచి దసరా ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటున్నారు. వీటిని వీక్షించడానికి దేశ విదేశాల నుంచి విచ్చేస్తారు. 405 సంవత్సరాల చరిత్ర ఈ ఉత్సవానిది. దసరా ఉత్సవాలను చూసి తరించాలంటే మాత్రం మైసూర్ వెళ్లాల్సిందే. ఆటలు–పాటల పోటీలు, యూత్ ఫెస్టివళ్లతో ఎగ్జిబిషన్లు, ఫుడ్ ఫెస్టివళ్లు...తో నగరం అంతా తిరునాళ్ల వాతావరణం నెలకొంటుంది. విజయదశమి రోజున జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించడం, వాటి ఆకులను ఇచ్చిపుచ్చుకోవడం అక్కడ ఆచారం. నవమినాడు ఆయుధ పూజ ప్రత్యేకం. ఇక్కడ ప్రతి ఒక్కరు తమ పనిముట్లను, వాహనాలను శుభ్రంగా కడిగి వాటికి ప్రత్యేక పూజలు చేయడం, మిఠాయిలు పంచుకోవడం ఆనవాయితీ. దసరా ఉత్సవానికి మైసూర్ ప్యాలెస్ ప్రధాన ఆకర్షణ. ఉత్సవాల రోజుల్లో ఇక్కడ హంగామా అంతా ఇంతా కాదు. వేలాది విద్యుద్దీపాలతో ప్యాలెస్‌ను అలంకరిస్తారు. సింహాసనం పెద్ద ఆకర్షణ. దీన్ని దసరా జరిగే పది రోజుల పాటు మాత్రమే తిలకించే అవకాశాన్ని ప్రజలకు కల్పిస్తారు. అంబారీ ప్రదర్శనలో పాల్గొనే ఏనుగుల బాగోగులు చూసుకోవడానికి పెద్ద వ్యవస్థ వుంటుంది. నాగహొళె ప్రదేశంలోని ఒక గ్రామంలో వుండే ఏనుగులు రెండు బృందాలుగా ఉత్సవాలకు హాజరౌతాయి. అభిమన్యు, గజేంద్ర, అర్జున, రేవతి, సరళ అనే ఏనుగులు ఒక బృందంగాను, మిగతా ఏనుగులు మరో బృందంగా వస్తాయి. ఊరేగింపులో పాల్గొనే ఏనుగులు, మావటీలు నెలరోజులపాటు రాజకుటుంబీకుల ఆతిథ్యం అందుకుంటారు. అంబారీ ప్రదర్శనకు ముందు జరిగే దసరా దివిటీల ప్రదర్శన కన్నుల పండుగగా వుంటుంది. విజయదశమి రోజున మహారాజు వంశస్తులు చాముండేశ్వరీదేవిని ఏనుగులపై ఊరేగింపుగా తీసుకొచ్చే సమయంలో కళాకారులు వీధుల్లో చేసే కోలాహలం అంతా ఇంతా కాదు. సైనికుల సాహసకృత్యాలకు ఎక్కడలేని ఆకర్షణగా వుంటుంది. ఇక తొమ్మిది రోజుల పాటు జరిగే బొమ్మల కొలువు ప్రత్యేకంగా నిలుస్తుంది. కళాప్రదర్శనలు చూడ్డానికి దేశం నలుమూలల నుంచి వచ్చేస్తారు. రాజభవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఏనుగుల అలంకరణా ప్రత్యేకమే. రాజుగారి ఆయుధపూజ ప్రత్యేకంగా జరుగుతుంది. వివిధ దేశాలు, రాష్ట్రాల సంస్కృతులకు దర్పణం పట్టే అనేక కళా ఖండాలు, వస్తువులు, ఆటవస్తువులు, వస్త్రాలు, దసరా ప్రదర్శనలో వుంటాయి. ఆటపాటలు, విందు వినోదాలకు కొదవే వుండదు. దసరా ఉత్సవాలు తిలకించేందుకు వచ్చినవారు ఈ దసరా ఎగ్జిబిషన్ చూడకుండా తిరిగి వెళ్లరు. మంగళూరులో జరిగే దసరా ఉత్సవాలు చూడ్డానికి దేశం నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు భారీగా హాజరౌతారు. ఇక్కడ జరిగే పులి వేషాలు, ఎలుగుబంటి వేషాలు దసరా పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

బెంగాలీల దసరా

పశ్చిమ బెంగాల్‌లో దుర్గాపూజ అన్నిటి కంటే పెద్ద పండగ. రాష్ట్రమంతా ప్రజలు దుర్గా సప్తమి నుండి దసరా దశమి వరకు పండగ చేసుకోవటంలో మునిగి తేలుతారు. సప్తమి నుండి దశమి వరకు కార్యాలయాలకు సెలవు ఇస్తారు. ఏ పండగ సందర్భంగానైనా కొత్త బట్టలు ధరించటం పరిపాటే కాని బెంగాల్ పద్ధతే వేరు. వీలైనంత వరకు అందరూ తన కుటుంబ సభ్యులందరికి బట్టలు పెడుతుంటారు. దాంతో బెంగాల్లో బట్టల వ్యాపారస్తులకు దుర్గాపూజ సమయంలో జరిగిన వ్యాపారంతో.... వారికి ఏడాది మొత్తంలో జరిగిన సగం కంటే ఎక్కువ భాగం వచ్చేస్తుంది. మిగతా సమయంలో పుట్టిన రోజులు, అన్నప్రాసనలకు వచ్చే వ్యాపారంతో వారికి గడిచిపోతుంది. ఇక ఇక్కడ అమ్మవారి విగ్రహాలు మరో ప్రత్యేకత. భారతదేశంలో ఎక్కడా లేనంతగా బహిరంగంగా దేవీ విగ్రహాలు ఏర్పాటు చేసి సామూహిక పూజ చేస్తారు. రాజధాని కొల్‌కతాలోనైతే వేల సంఖ్యలో చిన్నా, పెద్దా విగ్రహాలు పెట్టి పూజిస్తారు. విగ్రహాలన్నీ ప్రధానంగా కొల్‌కతాలో కుమార్‌టులిలోనే తయారౌతాయి. ఈ విషయంలో వారి సృజనకు ఆకాశమే హద్దు. ప్రతిమ కాక మండపాలు, అలంకరణకు కూడా చాలా ప్రాధాన్యత వుంటుంది. పెద్ద పెద్ద 'పండాళ్ళు (మండపాలు)' వెదురు రాటలు, రంగు రంగుల బట్టల సహాయంతో చూడ ముచ్చటగా నిర్మిస్తారు. ఈ తరహా ముస్తాబు చేయడంలో దేశం మొత్తంమీద బెంగాల్, అందులోనూ కొల్‌కతాకు ప్రత్యేక స్థానం వుంది. ప్రసిద్ధ ఆలయాలు, చారిత్రక, ప్రస్తుత అంశాలు లేక పక్తు ఊహాజనిత నమూనాలో ఈ తాత్కాలిక పూజా పండాళ్ళను నిర్మిస్తారు. సందర్శకులకు ఇది పెద్ద ఆకర్షణ. ఇక సాంస్కృతిక కార్యక్రమాలు సరేసరి. తొమ్మిది రోజులూ హరికథలు, బుర్రకథలు, పురాణ శ్రవణంతో సందడి నెలకొంటుంది. నిమజ్జనానికి ముందు 'సింధూర్ ఉత్సవ్' అత్యంత ఉత్సాహంగా జరుగుతుంది. దశమినాడే కాళీమాత నిమజ్జనం జరుగుతుంది. సెలవల అనంతరం తిరిగి కార్యాలయాలకు వెళ్ళినప్పుడు పురుషులు ఒకర్ని ఒకరు ఆలింగనం చేసుకుని అభివాదం తెలుపుకుంటారు. దీన్ని వారు 'కోలాకోలి' అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో దసరా సమయంలో టపాసులు కాలుస్తారు. దీపావళికి ప్రత్యేకంగా అంత హడావిడి ఉండదు. కాని కొలకతా లాంటి పెద్ద నగరాల్లో ఇతర భాషా సముదాయాలవారు కూడా ఉన్నందున వారితోపాటు బెంగాలీయులు కూడా దీపావళికి ప్రత్యేకంగా టపాసులు కాలుస్తారు. వ్యాపారులు, సంగీతకారులు, పుస్తక విక్రేతలు... అందరూ తమ తమ కొత్త వస్తువులను, పుస్తకాలను, మ్యూజిక్ ఆల్బమ్స్‌ను ఆరోజుల్లోనే విడుదల చేస్తుంటారు. సమైక్య భావనను పెంపొందించుకునేందుకు సహపంక్తి భోజనాలు కూడా నిర్వహిస్తారు.

ఒడిషా

ఒడిషాలో దసరాకు అనేక పేర్లున్నాయి. అకల్‌బోధన్, దుర్గా పూజ, షోడశ ఉపాసన, దుర్గోత్సవ్, శారదోత్సవ్... పేర్లతో దసరా సంబరాలు జరుగుతాయి. మార్చి నుంచి నవంబర్ వరకు రాష్ట్రంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే కనిపిస్తుంది. మార్చి ఏప్రిల్ మధ్య చైత్ర దుర్గాపూజ,

పులి వేషం

మైసూర్

విజయదశమి గాథలు

మనం చేసుకునే పండుగలు, ఉత్సవాలు, సంబరాల్లో మూఢనమ్మకాలు, చారిత్రక వాస్తవాలు వుంటాయి. పండుగలను విశ్లేషిస్తే అందులో దేవుళ్లు, మహిమలకు సంబంధించిన నమ్మకాలనూ, వాటి చుట్టూ వున్న పురాణ గాథలనూ, ఆ గాథల వెనుకవున్న చారిత్రక వాస్తవాలను వేరు చేసి చూడగలుగుతాం. పదిరోజులు సాగే దసరా పర్వదినాల్లో చివరి రోజైన విజయదశమినాడు ఉత్తరాదిలో రామలీల ఉత్సవాలు జరుపుతారు. ఆ రోజు రావణాసురుడిపై రాముడు విజయం సాధించాడని వారి నమ్మకం. దక్షిణాదిన దసరా సందర్భంగా రాముణ్ని ఎక్కడా కొలవరు. ఆరోజున అమ్మవారి పండుగలు జరపడమే దక్షిణాది ఆచారం. బెంగాల్‌లోనూ ఇదే వుంది. దుర్గామాత సింహారూఢురాలై మహిషాసురుడనే రాక్షసుణ్ణి వధించింది కాబట్టి ఆరోజును పండుగగా జరుపుకుంటారు. రెండిటిలోనూ కథలు వేరైనా చెడుపై మంచి సాధించిందన్న విజయానికి చిహ్నంగా దసరాను జరుపుకుంటున్నాం.

బొమ్మల కొలువు

తెలుగునాట దసరా సందర్భంగా బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. బొమ్మల కొలువు ప్రాచీన భారతంలోని వ్యవసాయ రంగంతో వున్న సంబంధ బాంధవ్యాలను వ్యక్తీకరించే సాధనం. పేరుకు తగ్గట్టుగానే బొమ్మల కొలువులో అనేక రకాల బొమ్మలను కొలువు దీరుస్తారు. ప్రధానంగా వీటిలో పలు రకాల దేవతామూర్తులున్నప్పటికీ వీటిలో పక్షి, జంతు బొమ్మలనూ పెడతారు. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే ప్రతిమలతో బొమ్మల కొలువును మరింత అందంగా తీర్చిదిద్దుతారు. వీటిలో అధికశాతం చెక్క బొమ్మలే వుంటాయి. ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలను మెరుగు పరిచే సాధనంగా బొమ్మల కొలువును పేర్కొంటారు.

సెప్టెంబర్ అక్టోబర్‌లో శారదీయ దుర్గాపూజ, అక్టోబర్ నవంబర్ మధ్య కాళీ పూజలు చేస్తారు. కటక్ కళాకారులు రూపొందించిన దుర్గామాత విగ్రహాలను దాదాపు ప్రతివీధిలోనూ పెడతారు. మహిళలు మానికలో వడ్లు నింపి లక్ష్మీదేవిగా భావించి పూజలు నిర్వహిస్తారు. దసరాకు పల్లెల్లో రామ్ లీల అనే జానపద నాటకాన్ని ప్రదర్శిస్తారు. పండగ చివరి రోజున రావణ దహనం చేస్తారు. బాణాసంచాతో తయారు చేసిన భారీ రావణ బొమ్మను మైదానంలో కాలుస్తారు. దీన్నే రావణ్ పోడి అంటారు. ఈ రావణకాష్టాన్ని చూడడానికి ప్రజలు తండోపతండాలు వస్తారు.

రామ్‌లీలా మైదాన్

విజయదశమి వచ్చిందంటే చాలు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌కు సమీపానున్న రామ్‌లీలా మైదానం జనంతో కిటకిటలాడిపోతుంది. ఈ మైదానం ఇప్పటికీ రాజకీయ సభలకు పెట్టింది పేరు. పండుగలకు, ఉత్సవాలకు, దసరా రోజున జరిగే మందుగుండు పేలుడుకు కూడా వేదిక ఇదే. రంగస్థల నటులు వేషాలు వేసుకొని వేదికలపై రామాయణాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శిస్తారు. వెదురు బొంగులతో రామాయణంలోని ముఖ్యపాత్రధారులైన రావణుడు, మేఘనాథుడు, కుంభకర్ణుడి బొమ్మలను తయారు చేసి ఊరేగించి పదవ రోజున వాటిని దగ్ధం చేస్తారు. రావణాసురుడి వధకు గుర్తుగా ఈ కార్యక్రమం ముగుస్తుంది.

గుజరాత్

పండగ వచ్చిందంటే ఇల్లు అలికి ముగ్గులు వేసుకుంటారు నేటికి కొందరు గ్రామస్తులు. అలాంటి సంప్రదాయం గుజరాత్‌లో నేటికీ వుంది. కాకపోతే గోడల మీద వేస్తారు. పసుపు రంగులో మెరిసిపోయే ఆయుధాల బొమ్మలు పండుగ శోభను తెలియచేస్తుంటాయి. దసరా రోజున పొద్దున్నే పొలాల్లోకి వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టిని కుండల్లో నింపి దాని మీద బార్లీ, గోధుమ గింజల్ని చల్లుతారు. అందులో రాగి లేదా వెండి నాణెం వేస్తారు. అలా అలంకరించిన మట్టికుండను దేవిగా ఆరాధించడం గుజరాతీల ఆచారం. దీన్నే కుంభ ప్రతిష్ట అంటారు. అన్నిట్లోకి గార్బా ఉత్సవం ముఖ్యమైనది. మహిళలంతా పాల్గొని పాటలు పాడతారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక జానపద నృత్యాలైన గార్భ (కోలాటం), దాండియా నృత్యాల పోటీలు జరుగుతాయి. మరీ ముఖ్యంగా అహ్మదాబాద్ నగరం దసరా పండుగకు నృత్యాలతో ఊగిపోతుంది. ఈ నృత్య ప్రదర్శనలు చూడ్డానికి రెండు కళ్లు చాలవు. అహ్మదాబాద్ జిడిఎంసి మైదానంలో జరిగే నవరాత్రుల్లో ఒకేసారి వేలాది మంది కళాకారులు నృత్యాలు నిర్వహిస్తారు. గుజరాత్ పర్యాటక శాఖ దీన్ని నిర్వహిస్తుంది. స్థానికులే కాక విదేశాల నుంచి పర్యాటకులు విచ్చేస్తారు. ఈ సమయంలో హస్తకళలు, సంప్రదాయ దుస్తులు, కళాఖండాలు అమ్మకాలతో ఈ ప్రాంతం పెద్ద జాతరను తలపిస్తుంది.

వారణాసి, కులు లోయలో...

వారణాసికి రెండు కి.మీ. దూరంలో వున్న దుర్గాదేవి ఆలయం దసరాకు కిటకిటలాడుతుంది. పద్దెనిమిదవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయాన్ని అప్పటి బెంగాలీ మహారాణి నిర్మించారని చెప్తారు. ఇక హోటళ్లు, లాడ్జీలు, దుకాణాల్లో ఆఫర్లు ఊరిస్తుంటాయి. దసరా స్పెషల్స్ మెనూలో ప్రత్యేకంగా వుంటాయి. పట్టణానికి 15 కి.మీ దూరంలో వున్న రాంలీలలో రామయణ ఘట్టాలు నిర్వహిస్తుంటారు. చివరి రోజున రావణాసురిడి దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తారు. ఇక్కడ పది రోజుల పాటు దసరా ఉత్సవాలు జరుపుకుంటారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కులూ దసరాకు ప్రత్యేకత

జమ్మి ప్రత్యేకత

దసరా రోజుల్లో జమ్మి చెట్టుకు లభించే ప్రాముఖ్యత ఈనాటిది కాదు. ప్రాచీన కాలం నుంచీ వుంది. ఇనుము ఇంకా అందుబాటులోకి రాని రోజుల్లో ఏ పరికరాన్నయినా రాయి లేదా చెట్టు కొమ్మలతోనే తయారుచేసుకునేవారు. అన్ని కొయ్యల్లోనూ జమ్మి కొయ్య గట్టిగా వుంటుంది. అందుకే ఆ సాధనాల తయారీకీ జమ్మిని వాడేవారు. ఇనుము వచ్చాక అప్పటి వరకు తమకు సాయపడిన జమ్మిచెట్టును పూజించడం ఆరంభించారు. పురాణ గాథ ప్రకారం పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేప్పుడు తమ ఆయుధాలను జమ్మిచెట్టు మీద దాచుకున్నారట. ఆది మానవుడి కాలం నుంచి మనిషికి జమ్మిచెట్టుకి గల అనుబంధమిది. ఆ అనుబంధంతోనే ఇప్పటికీ పండుగ రోజున జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు చెప్పుకుంటూ వుంటారు.

ఆయుధ పూజ

దసరా పండుగలో ఆయుధ పూజ ఒక భాగంగా వుంటుంది. ఈ పండుగ సందర్భంగా పూజించే అమ్మవారి చేతిలోనే కాదు. ఎందరో దేవతల చేతుల్లో త్రిశూలం, పాశం, అంకుశం, చక్రం, విల్లు, గద, ఖడ్గం, శూలం... వంటి ఆయుధాలు వుంటాయి. ఈ ఆయుధాలు శత్రువులను వధించడానికి ఉద్దేశించిన ఆయుధాలుగా భావించడం పరిపాటి. ఈ ఆయుధాలను మారణాయుధాలుగా మాత్రమే చూస్తే మానవ తిరోగమనమే మిగులుతుంది. అదే వాటిని జీవించడానికి అవసరమైన వనరులను సంపాదించుకోవడానికి తోడ్పడే పరికరాలుగా చూసినప్పుడు అవి పురోగమన సంకేతాన్ని అందిస్తాయి. మానవ చరిత్రలో మనిషి ఆహార సంపాదనకు ఆయుధాలను తయారు చేసుకున్నాడు. త్రిశూలాన్నే చూద్దాం. చేపలు పట్టుకోవడానికి మనిషి కొయ్యతో తయారుచేసుకున్న పరికరమని పురామానవ శాస్త్రజ్ఞులు అంటారు. అది ఇప్పటిలా మూడు కొనలూ పైకి వుండే ఆయుధం కాదు. ఒక కొన ముందుకీ, రెండు కొనలు వెనక్కీ వుండే పరికరం.చేప శరీరంలోకి గుచ్చి లాగడానికి ఈ ఏర్పాటు అనువుగా వుంటుంది. పాశం విషయానికి వస్తే ఇది కూడా చేపలను పట్టుకోవడానికి ఉద్దేశించినదే. మూల మట్టంగా వుండే ఒక కొయ్యను చక్రంగా మలచుకున్నాడు. ఇది బండి చక్రంలా వుండదు. దీనిని జంతువు మీదకు ఉపయోగించినప్పుడు అది పడనైనా పడుతుంది. గురి తప్పితే తిరిగి చేతికే వచ్చి చేరుతుంది. విల్లు కూడా ఆహార సంపాదనలో భాగంగా వేటాడడానికి చేసుకున్న ఆయుధమే. మనిషి జీవించడానికి తయారుచేసుకున్న ఆయుధాలు తర్వాత సాటి మనిషిని చంపే మారణాయుధాలుగా మారాయి. పూర్వం రాజులు శరత్కాలంలో శత్రు రాజుల మీదకు యుద్ధాలకు వెళ్లేవారు. అలా ఆయుధాలను పూజించే కార్యక్రమం ప్రారంభమైంది. అలాగే దసరా సందర్భంగా మల్ల యుద్ధ విద్యల ప్రదర్శన కూడా వుండేది. వీరులను సత్కరించేవారు.

రామ్ లీలా మైదానం

వుంది. ఇక్కడ అక్టోబర్ మాసం అంతా పండుగ వాతావరణం నిండిపోతుంది. నృత్యాలు, చిత్రలేఖన ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు గురించి ఎంత చెప్పినా తక్కువే.

ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్ జగ్దల్‌పూర్‌లో దంతేశ్వరి మాత ఆలయంలో దసరా వేడుకలను 75 రోజుల పాటు వైభవంగా జరుపుకుంటారు. అలాగే బస్తర్ జిల్లా వేడుకలనూ ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. ఇది పూర్తిగా అటవీ ప్రాంతం. పైగా ఎక్కువగా గిరిజనులు నివసించే ప్రదేశమిది. ఇక్కడి దసరా వేడుకలు మిగతా ప్రాంతాలకు భిన్నంగా వుంటాయి. ఇతర రాష్ట్రాలలో అధికంగా దసరాను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటే ఇక్కడ 90 రోజుల పాటు చేస్తారు. ఇక్కడి వేడుకలు మైసూర్ వేడుకలను మరిపిస్తాయని కూడా అంటారు. మిరుమిట్లు గొలిపే బాణా సంచా ఒకవైపు మారుమోగుతుండగా, మరో వైపు డప్పులు, డోళ్ల శబ్దాలు వీనుల విందు చేస్తాయి. వీధులన్నిటినీ పూలతో అలంకరిస్తారు. బస్తర్ ప్రజలు దుర్గాదేవిని దంతేశ్వరి పేరు మీద కొలుస్తారు. బస్తర్ దసరా వేడుకలకు 500 ఏళ్ల చరిత్ర వుంది. ఇక్కడ మరియా, మురియా, అబుజ్ మరియా, దుర్వా, దొర్లా, బాత్రా, హల్బా తెగలకు చెందిన గిరిజనులు ఎక్కువగా వున్నారు. వారంతా కలిసి కట్టుగా ఈ వేడుకల్లో పాల్గొంటారు. శ్రావణమాసంలో వచ్చే అమావాస్య రోజున దసరా ఉత్సవాలను ప్రారంభిస్తారు. అయితే రథోత్సవాన్ని మాత్రం రెండేళ్లకోమారు నిర్వహిస్తారు. ప్రత్యేక కర్రలతో చేసిన రథాన్ని పటజాత్రా అనిపిలుసుస్తారు. బెడా ఉమర్‌గావ్‌కు చెందిన వడ్రంగులు ప్రత్యేక పద్ధతులను అనుసరించి ఈ రథాన్ని తయారుచేస్తారు. ఇందులో ఎక్కడా మేకులను వాడరు. పూర్తిగా తాళ్లతోనో, స్థానికంగా పెరిగే తీగలతోనే వాటిని కడతారు. పూలతో అలంకరించిన రథాన్ని ఉత్సవం పూర్తిచేస్తారు. దీనితో పాటు రథ యాత్రతో పాటు ఊరేగింపు కూడా ఆకర్షణీయంగా వుంటుంది. దారి పొడవునా గిరిజన సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఉల్లాసవంతమైన ఆటలు కనువిందు చేస్తాయి. ముగింపు రోజున అంతా కలసి భోజనం చేస్తారు. ఇందుకు ప్రత్యేక ఆకులతో చేసిన విస్తళ్లను ఉపయోగిస్తారు.

మరికొన్ని రాష్ట్రాలలో...

- మహారాష్ట్రలో తొమ్మిది రోజుల పాటు దుర్గ పూజలు చేస్తారు. చివరి రోజున శమీపూజను తప్పక జరుపుకుంటారు. గ్రామ దేవతల ఆలయాలలో ఈ దసరాను చేసుకుంటారు. మహిళలు ఒకరికొకరు పాపిట కుంకుమ పెట్టుకుంటారు.
- తమిళనాడులో కూడా బొమ్మల కొలువు ఆచారం వుంది.
- రాజస్థాన్ రాష్ట్రంలోని కోట పట్టణంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇక్కడ జరిగే వివిధ రకాల పండుగలలో దసరా పండుగకు ఒక ప్రత్యేక స్థానం వుంది. పండుగ ప్రారంభం నుంచి చివరి రోజైన విజయదశమి వరకు కళాకారులు ఎటువంటి అలసట లేకుండా నాట్యాలు, కచేరీలు, డ్యాన్సులు, ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతారు.మన సోదర రాష్ట్రమైన తెలంగాణలో దసరా సమయంలో బతుకమ్మ (గౌరి) పండుగను జరుపుకుంటారు.

✦

రైట్.. రైట్..

తమిళుల రాజధానిలో ప్రధాన ప్రాంతమైన పారిస్ వీధిలో ఓ చిన్న గది దగ్గర నిత్యం సందడిగా ఉంటుంది. చేతిలో ఏవేవో డాక్యుమెంట్లు పట్టుకుని సామాన్యులంతా బారులు తీరి ఉంటారు. ఇక్కడేది పెద్ద ప్రభుత్వ కార్యాలయమేమి లేదు. ఆ గదిలోకి తొంగి చూస్తే ఎనిమిది పదులు నిండిన ఓ వృద్ధుడు కంచు కంఠంతో ఫోన్లో ఎవరికో బుద్ధి చెబుతూ కనబడతాడు. ఇటు మాట్లాడేది ట్రాఫిక్ రామసామి అయితే అటు వినేది ఏ పక్కదారి పట్టిన ప్రభుత్వాధికారో అయి ఉంటాడు. ఫోన్‌లో వ్యవహారం తేలకపోతే విషయం పిల్ వరకు వెళ తుంది మరి. రెండు దశాబ్దాలుగా 400కు పైగా వివిధ సామాజిక అంశాలు, ప్రజా సంబంధిత విషయాలపై ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేసిన ఆయన ఎన్నో విజయాలు సాధించాడు. చెన్నై నగరంలో చెప్పుకోదగ్గ మార్పులు తెచ్చాడు. బుద్ధి గడ్డి తిన్న ప్రభుత్వాధికారుల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రజల వరకు ఎవరినీ ఆయన వదల్లేదు. లెక్కా చేయలేదు. దానికి ఫలితం చాలా దాడులు ఎదుర్కోవడం. కత్తి పోటుకి కంటిని పోగొట్టుకోవడం. భయంతో కుటుంబం దూరమవడం. అయినా ఈ వృద్ధుడి తపన తగ్గలేదు. ప్రజల బాధలు తీరేందుకు ఎంత దూరమన్నా వెళ్లేందుకు వెనుకాడడు. ఏకంగా ముఖ్యమంత్రులపైనే కోర్టుకెక్కిన సందర్భాలు అనేకం. ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఆయన వ్యవసాయంతోనే పెరిగాడు.

చెన్నై వెళ్లి ట్రాఫిక్ రామసామి పేరు చెబితే కొందరు ప్రభుత్వ అధికారులు హడలెత్తిపోతారు. కొందరు గౌరవంగా మాట్లాడతారు. ఏదేమైనా సామాన్యుడికి మాత్రం ఆ పేరు బలాన్నిచ్చే గుళిక. ఇలా చెన్నై వాసులకు ఆయన పవర్ పిల్ కావడానికి కారణం ఆయన ఆయుధమైన పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యమే).

సి.రాజగోపాలచారి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో సహాయకుడిగా చేసిన ఆయన బిన్నీ మిల్లులో కార్మికుడిగా పనిచేశాడు. నిత్యం రద్దీగా ఉండే చెన్నై రోడ్లు ట్రాఫిక్ పద్మవ్యూహాలుగా అప్పుడే ఉండేవి. ఉద్యోగ విధులు పూర్తిచేసుకుని గంటల తరబడి రోడ్లపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూండేవాడు. ఎన్నో రోడ్డు ప్రమాదాలకు నిర్లక్ష్యపు డ్రైవింగే కారణమని గమనించి ప్రచార కార్యక్రమాలు చేసేవాడు. వీటికి ఉద్యోగం అడ్డుగా అనిపించడంతో 1992లో రాజీనామా చేసి పూర్తిగా ట్రాఫిక్ సమస్యపైనే దృష్టి పెట్టాడు. తనతో పాటు కొందరు వలంటీర్లను పోగేసి రద్దీగా ఉండే రోడ్ల వద్దకు వెళ్లి ట్రాఫిక్‌ను మళ్లించేవాడు. దీంతో ఆయనకు 1998లో ట్రాఫిక్ రామసామి అనే పేరు వచ్చింది. కేవలం ట్రాఫిక్ మళ్లింపుతోనే ఆయన పని ఆగలేదు. రోడ్డుపై తోపుడు బళ్ల వారు, చోదకుల జేబుల్ని పిండేసే అవినీతి పోలీసుల చర్యలను ఫొటోలు తీసి పైఅధికారులకు పంపించేవాడు. అక్కడ చర్య లేకపోతే కోర్టుకెక్కేవాడు. 1997లో తొలిసారి ఓ అక్రమ ఫ్లై ఓవర్ నిర్మాణంపై పిల్ వేశాడు. 30 మంది వివిధ యాక్సిడెంట్లలో మరణించడానికి కారణం పారిస్ రోడ్డులో ఫ్లై ఓవర్ నిర్మాణ అవకతవకలే అని తెలుసుకుని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పిల్ వేసి గెలిచాడు. 2002లో అక్రమ వాహనాల తయారీపై మరో పిల్ వేసి గెలిచాడు. దొంగిలించిన బైక్‌ల ఇంజిన్లతో మామూలు రిక్షాలను మోటారు వాహనాలుగా మార్చి ఏమాత్రం భద్రతా ప్రమాణాల్ని పాటించకుండా రోడ్లపై తిరుగుతూ నిండు ప్రాణాల్ని బలిగొంటున్నవారిపై పిల్ వేశాడు. ఈ సందర్భంగానే దాడికి గురై కన్ను పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత వ్యక్తిగత భద్రత కోర్టు ఏర్పాటు చేసింది. ప్రభుత్వాధికారులు కక్షగట్టడంతో కూడా అనేక ఇబ్బందులు పడ్డాడు. 11 సార్లు అరెస్టవడం, శత్రువులు ఎక్కువై కుటుంబాన్ని వదలమని బెదిరింపులు, దాడులకు పాల్పడటంతో భయపడి భార్యపిల్లలు వదిలేసి పోయారు. ఒకప్పుడు వరకట్నం తీసుకోని కారణంతో తండ్రి అలిగి రామసామి పెళ్లికి హాజరు కాకున్నా పట్టించుకోలేదు. 12 ఏళ్లుగా ఒంటరిగానే జీవిస్తున్న రామసామికి చెన్నై వాసుల రూపంలో పెద్ద కుటుంబమే ఏర్పడింది. ఆయన ఎందరి పక్షానో నిలబడి న్యాయం చేకూర్చడంతో అభిమానంతో అండదండగా నిలిచిన సైన్యంగా మారారు. నీతిమంతమైన ప్రభుత్వాధికారులు, చైతన్యం కలిగిన పౌరులు, ఆయన అడుగుజాడల్లో నడిచే విద్యార్థులు ఇలా ఓ బలమైన శక్తిగా ఆయన సైన్యం ఉంటుంది. కొన్నేళ్ల క్రితం ఫాతిమా అనే ఓ అనాథ యువతి ట్రాఫిక్ రామసామి వాహనాల్ని మళ్లిస్తుంటే ఆసక్తిగా చూసేది. తాను కూడా అలా చేస్తానంటే ట్రాఫిక్ పాఠాలు నేర్పి ఆమెను ఓ వలంటీర్‌గా మార్చి ఓ గూడు ఏర్పాటుచేశాడు. ఇప్పుడా యువతి దక్షిణ తమిళనాట తన కార్య క్రమాలు, ప్రచారం ద్వారా అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. తాను ఇరవై ఏళ్లలో చేయగలిగింది ఫాతిమా రెండేళ్లలో చేసేసిందని గర్వంగా చెప్పుకుంటాడు ఆ పెద్దాయన. అక్రమ కట్టడాలు, హద్దు దాటిన వీఐపీల సంస్కృతి, సామాన్యునికి ఉపయోగపడని బస్సు రూట్లు, వీధుల్ని మింగేసే పార్టీల ఫ్లెక్సీలు ఇలా ఎన్నో విషయాలపై పిల్స్ వేసి న్యాయపోరాటం చేసిన రామసామికి వాటి లెక్కలు గుర్తులేవు. 'అమ్మ' పేరిట పథకాలు పెట్టి ప్రజాధనాన్ని రాజకీయ వసరాలకు వాడుకుంటోందని జయలలితపై కోర్టుకెక్కడం సంచలనమైంది. ఇంత ముదిమి వయసులోనూ ఓ పక్క ట్రాఫిక్ సమస్య, మరో పక్క న్యాయపోరాటం చేస్తూ క్రియాశీలమైన జట్టును నడిపిస్తున్నాడు. ✦

నవ్వుల్ – పువ్వుల్

సీటు



ఒక పేకాట క్లబ్ మీద పోలీసులు రైడ్ చేశారు. అందరూ తలా ఒక దిక్కుకి పారిపోతున్నారు. వెంగళప్ప మాత్రం పరిగెత్తుకుంటూ వెళ్ళి పోలీసుల జీపు ఎక్కి కూర్చున్నాడు. పోలీసులు మిగతా అందర్ని పట్టుకున్నారు.

పోలీస్: నువ్వు చాలా గొప్పోడివిరా బాబూ...చేసిన తప్పు తెలుసుకొని ముందే వచ్చి కూర్చున్నావ్.....

వెంగళప్ప: పోయినసారి లేట్‌గా దొరికినందుకు స్టేషను వరకు నిలబడి వెళ్ళాల్సి వచ్చింది.....

అర్థం కారెందుకో!

మహిళలను అర్థం చేసుకోవడం మహా కష్టం వాళ్ళ అందాన్ని పొగిడితే అబద్ధం ఆడుతున్నామంటారు, పొగడకపోతే సౌందర్య దృష్టి లేదంటారు. చెప్పిందానికల్లా ఒప్పుకుంటే డూడూ బసవన్న అని వెక్కిరిస్తారు. ఒప్పుకోకపోతే అర్థం చేసుకునే మనసు లేదంటారు. ఎక్కువ మాట్లాడితే బోర్ అంటారు, మాట్లాడకపోతే ప్రేమ లేదంటారు

ఇంత త్వరగానా?

ఇద్దరు వెంగళప్పలు కష్టపడి ఓ పజిల్ పూర్తి చేశారు. ఆ ఆనందంలో పార్టీ చేసుకోవడానికి బార్‌కి వెళ్లారు.

చాలా హుషారుగా ఉన్నారు. విశేషమేంటి సార్ అని అడిగాడు బేరర్ వీళ్లని చూసి.

అతి కష్టమైన ఓ పజిల్‌ను మేమిద్దరం పూర్తి చేశాం. అందుకే ఈ సంతోషం అన్నాడో వెంగళప్ప.

అంత కష్టమైన పజిలా అది?

అవును దాని కింద మూడు నుంచి ఐదేళ్ల లోపు అని రాసి వుంది. మేమిద్దరం ఆరు నెలల్లోనే పూర్తి చేయగలిగామంటే మాటలా అన్నాడు మరో వెంగళప్ప.

తెలివి

అమ్మాయి: ఇవాల పర్స్ ఇంట్లో మర్చిపోయా ఒక 1000 రూ. ఇవ్వవా షాపింగ్ చేయాలి.

బాయ్‌ఫ్రెండ్: ఎంత మాటన్నావ్ డియర్, ఇదిగో ఈ 50 రూ. తీసుకుని ఆటోలో ఇంటికి వెళ్ళి పర్స్ తీసుకో...

ముగ్గురం

సుబ్బలక్ష్మి: ఏవండీ. మనం త్వరలో ముగ్గురం కాబోతున్నాం.

అప్పారావు: యాహు మరి ఇంత మంచి విషయం ఇంత నెమ్మదిగా చెబుతావేం... మరి ఈ విషయం పొద్దునెందుకు చెప్పలేదు. వచ్చేటపుడు నీకు గిఫ్ట్ తెచ్చేవాడ్ని కదా!

సుబ్బలక్ష్మి: నాకు మాత్రం ఏం తెలుసునండీ... గంట క్రితమే ఫోన్ వచ్చింది

అప్పారావు: ఫోనేంటి?

సుబ్బలక్ష్మి: మా అమ్మ మనింటికి వస్తున్నట్టు గంట క్రితమే ఫోన్ చేసి చెప్పింది.

ఒక్క మార్కు

భాగ్యలక్ష్మి: ఏమండీ మన పక్కింటి రావుగారి అమ్మాయికి లెక్కల్లో తొంబై తొమ్మిది మార్కులు వచ్చాయి తెలుసా!

సుబ్రమణ్యం: మిగతా ఆ ఒక్క మార్కు ఎవడెత్తికెళ్లాడట...!

భాగ్యలక్ష్మి: ఇదిగో మన పుత్రరత్నం పట్టుకొచ్చాడు.

మహా ముదురు!

నువ్వు పెద్దయ్యాక ఏం చేస్తావ్?
పెళ్ళి చేసుకుంటా
అది కాదురా ఏమవుతువని అడిగా
పెళ్ళి కొడుకునవుతా
నా ఉద్దేశ్యం పెద్దయ్యాక ఏమి సాధిస్తానవి
పెళ్ళి కూతుర్ని
ఒరేయ్ పెద్దయ్యాక అమ్మానాన్నల కోసం ఏం తెస్తావని?
కోడల్ని
మీ నాన్న నీ దగ్గరి నుండి ఏం కోరుకుంటున్నాడు?
మనవడిని
ఓరి దేవుడా– ఇంతకీ నీ ఆశయం ఏమిట్రా
"మేమిద్దరం– మాకిద్దరు"

పాలరాతి కల



ఓ అద్భుత పాలరాతి కళను కళ్ల నిండుగా కౌగిలించుకోవాలంటే దిల్వారా దిక్కుగా అడుగులు వేయండి. రాజస్థాన్ ఎడారి వేడిమిలో ఇక్కడి చలువరాయి చలవదనం కన్నా వన్నెదనమే మగతను కలిగిస్తుంది. మౌంట్ అబూకి దగ్గరలోని ఈ జైన మందిరాలు కళా బానిసల హృదయాలకు మరిన్ని సంకెళ్లు వేస్తాయి.

థార్ ఎడారిలో ఒకే ఒక హిల్‌స్టేషన్ మౌంట్ అబూ. 1200 అడుగులకు పైగా ఎత్తులో కనుచూపు మేర పరుచుకున్న ఎడారి నెగళ్లతో చలికాచుకునే ప్రాంతమిది. పగళ్లు ఎండతో తల తిరిగేలా చేస్తే, రాత్రుళ్లు ఒళ్లు బిగుసుకుపోయే చలి వేధిస్తుంది ఎడారుల్లో. కానీ మామిడి వనాల మయమైన అబూ ప్రాంతం దీనికి భిన్నం. ఈ సానుకూలతే అబూ పీఠాన దిల్వారా జైన మందిరాలకు పట్టం కట్టింది. దక్షిణాన శిల్పుల చేతి స్పర్శ తగిలి పురివిప్పిన తంజావూరు బృహదీశ్వరాలయం కట్టిన కాలానికి చెందిన దిల్వారా ఉత్తరాన కళాకారుల చేతిపనితో శ్వేత లతలా అల్లుకుంది. వేర్వేరు కాలాల్లో వికసించిన 5 ఆలయాల్ని కలిపి దిల్వారా మందిరాలుగా పేర్కొంటున్నారు. విమల్ వసాహి, లూనా వసాహి, పీతల్‌హార్ వసాహి, ఖర్తార్ వసాహి, మహావీర్ వసాహి మందిరాలుగా పిలువబడే ఈ ఆలయాల్లో ఒక్కో కట్టడా నిది ఒక్కో కళా విన్యాసం. మైళ్ల దూరాన ఉన్న అంబోజిలోని అరాసూరి కొండల్లోని పాలరాతి గనుల నుంచి దుర్గమమైన అబూ ప్రాంతానికి ఏనుగుల ద్వారా రాతిని తరలించి కట్టారు ఈ శ్వేత ధామాల్ని. తాజ్‌మహల్‌తో సరిసమానంగా పేరు సంపాదించిన ఈ పాలరాతి కట్టడాలు అద్భుత సూక్ష్మ కళతో శోభిస్తాయి.

అల్లుకున్న లతావనం

జైన తొలి తీర్థంకరుడు రిషభనాథుడి ఆలయం విమల్ వసాహి. సోలంకి (చాళుక్య) రాజైన భీమదేవ-1 దగ్గర మంత్రిగా పనిచేసిన విమల్ షా దీనిని నిర్మించాడు. 1500 మంది శిల్పులు, 1200 మంది కూలీలు కలిసి 14 ఏళ్లపాటు శ్రమించి ఈ కట్టడాన్ని గర్వపడేలా చెక్కారు. క్రీ.శ. 1031లో నిర్మితమైన ఈ కట్టడం తీరే ప్రత్యేకం. వృత్తాకారంలోని ఎత్తైన గోడ మధ్య పాక్షికంగా తెరచి ఉన్నట్టు ఉండే ఈ కట్టడానికి వెళ్లే మార్గంలో ఎదురుపడే ద్వారాలు అంగుళం కన్నా సూక్ష్మంగా ఉండే నగిషీ పనితో అబ్బురపరుస్తాయి. కుడ్యాల నిండా పలు రకాల ఆధ్యాత్మిక చిహ్నాలు, సన్నివేశాలు, దేవతా మూర్తులు, రుషులు, జంతువుల రూపాలతో సన్నని శిల్పాలు ఎంతో సమాచారాన్ని పొందుపరుచుని ఉంటాయి. పాల రాతి స్తంభాలపై కాస్త ప్రదేశం కూడా ఏ అలంకరణ లేక బోసిపోదు. స్తంభాలపై ఆసీనులై ఉన్నట్టు తోచే పైకప్పులు విరబూసిన చలువరాతి పద్మాలను విప్పార్చుకున్నాయి. 58 కుబ్జ మందిరాల్లో తీర్థంకరుల పాలరాతి విగ్రహాలు వరసగా కొలువుదీరి ఉంటాయి. 12 స్తంభాలతో కూడిన రంగమంటపంలో మధ్యగా వేలాడుతున్నట్టుండే గుమ్మటం 9 చతురస్రాకారాపు పైకప్పు వరసల మధ్య ఉంగరానికి పొదిగిన ముత్యంలా అనిపిస్తుంది. నవ్ చౌకి అనే ఈ నిర్మాణ విశేషం మిగతా జైన దేవాలయాలకు విస్తరించింది. 12 పాలరాతి స్తంభాలపై 16 మంది విద్యాదేవిలు ఆయా జ్ఞాన చిహ్నాలను ధరించి ఆసీనులై ఉంటారు. వివిధ వాద్య పరికరాలు పట్టుకున్న సంగీతకారిణుల్ని అపురూపంగా చెక్కారు. విమల్ షా వారసుడు పృథ్వీపాలుడు 1147-49లలో హస్తీశాల అనే మరో నిర్మాణాన్ని జతచేసి ఆలయ కళా సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేశాడు. పది ఏనుగుల పాలరాతి శిల్పాలు వరసగా చెక్కించాడు. శిల్పాలు ఎంత నునుపుదనంతో ఉంటాయంటే వాటి మీద పడిన కాంతి ప్రతిబింబిస్తుంది.

ముచ్చటైన గుమ్మటం

వాస్తుపాలు తేజ్‌పాల్‌లు తన సోదరుడు లూనాపాలుడి జ్ఞాపకార్థం నిర్మించిన లూనా వసాహి 22వ తీర్థంకరుడు నేమినాథుని అద్భుత జైన మందిరం. వాఘేలా రాజు విర్ధ్వాల్ దగ్గర పనిచేసిన వీరు క్రీ.శ.1230లలో ఈ కట్టడాన్ని నిర్మించతలపెట్టారు. 2500 మంది కళాకారులు స్వప్నించి 15 ఏళ్లలో నిజం చేసుకున్న ఈ కట్టడం అచ్చెరువొందించే సునిశితమైన జాలీ పనితనంతో చూపు తిప్పుకోనివ్వదు. ఎంత సునిశితంగా ఉంటుందంటే పాలరాయి శిల్పి నగిషీకి కరిగి కరిగి పారదర్శకంగా కనిపిస్తాయి చెక్కుళ్లు. ఇక్కడ మరో విశేషమేమంటే ఆలయమూర్తి నల్లరాతి శిల్పంతో రూపొందించారు. ఆలయానికి ఎడమ పక్కన నల్లరాతి కీర్తి స్తంభం కూడా ఉంటుంది. దీన్ని మేవాడ్‌కు చెందిన రాజు మహారాణా కుంభ నిర్మింపజేశాడు. లూనా వసాహికి ప్రత్యేకత తెచ్చింది గుమ్మటమనే చెప్పాలి. నవ్‌చౌకీ మధ్యన రాతిని చెక్కి రూపొందించారని చెప్పడం కన్నా చిత్రీకరించారంటేనే న్యాయంగా అనిపిస్తుంది. శిల్పుల పనితనమంతా ఇక్కడే పోగుబడిందా అని అనిపించకమానదు. శ్వేత పతకంలా వేలాడే దీనిపై వృత్తాకారపు కట్టులపై జైన తీర్థంకరుల 72 శిల్పాలు, వివిధ భంగిమల్లో 360 సన్యాసుల శిల్ప విన్యాసాలు సమ్మోహితుల్ని చేస్తాయి.

పంచలోహ హారం

జైన తీర్థంకరుడు రిషభనాథుడి కోసం భామాషా కావ్డియా నిర్మించిన మరో దిల్వారా మందిరమే పీతల్‌హార్ వసాహి. 1468-69 మధ్య నిర్మించిన ఈ మందిరంలో విశేషమేమంటే బంగారం, వెండి, రాగి, తగరం, ఉక్కు మిశ్రధాతువుతో తయారుచేసిన భారీ మూర్తి ఇక్కడ ప్రత్యేకం. దేతుడు అనే కళాకారుడు రూపొందించిన ఈ మూర్తి 4 టన్నుల బరువుంటుంది. ఎనిమిది అడుగుల ఎత్తు, 5.5 అడుగుల వెడల్పుతో ఉండే ఈ పంచలోహ విగ్రహంలో 41 అంగుళాల మూర్తి రూపం అత్యంత తేజోవంతంగా ప్రకాశిస్తుంది. వందల ఏళ్లు అయినా రంగుమార్పులతో ఆకట్టుకుంటూనే ఉంటోంది. పంచలోహ విగ్రహాల తయారీ అత్యంత నేర్పైన కళగా గుర్తించడానికి కారణమిదే. రంగులో మార్పులు చోటుచేసుకుంటానికి ధాతువుల మిశ్రమం కొలతలు అతికీలకం. అదీ అంత భారీ విగ్రహం రూపొందించడం అత్యంత క్లిష్టమైన విషయం. మరికొన్ని తగరపు విగ్రహలు ఉండటంతో దీనికి పీతల్‌హార్ వసాహిగా పేరొచ్చింది.

కళాసౌందర్యానికి ప్రతీకలు

23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడి మందిరంగా నిర్మించినదే పార్శ్వనాథ్ వసాహి ఆలయం. 1458-59లో రూపుదిద్దిన ఈ కట్టడం మిగతా మందిరాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నలుదిక్కులా నాలుగు మండపాలతో మూడు అంతస్తుల్లో దీన్ని కట్టారు. నలుదిక్కుల్ని కావలి కాస్తున్నట్టుండే దిక్పాలకుల రూపాలు ఆకట్టుకుంటాయి. విద్యాదేవి, యక్షిణులు, సాలభంజికలు అద్భుతమైన పనితనంతో చూపుతిప్పుకోనివ్వవు. ఈ శిల్పాల కళాసౌందర్యాన్ని ఖజురహో, కోణార్క్ శిల్పాలతో సమానంగా కొలుస్తారు. ఇక్కడి బయటి గోడల్ని పాలరాతితో కాక బూడిద రంగు ఇసుక శిలలతో నిర్మించడం విశేషం. దిల్వారా ఆలయాల్లో మిగిలిన మహావీర్ స్వామి మందిరం ప్రత్యేకమైందే. జైన చివరి తీర్థంకరుడు మహావీరుని మూర్తిని కొలువుదీర్చిన ఈ ఆలయాన్ని క్రీ.శ. 1582లో నిర్మించారు. ఈ ఆలయం లోని ప్రతి ద్వారం, కుడ్యం సూక్ష్మ కళారూపాలతో నిండి ఉంటాయి. లతల అల్లికల్లా పైకప్పులు శ్వేత వనాన విహరింపజేస్తాయి. దీని సౌందర్యానికి మరిన్ని మెరుగులు దిద్దాడు సిరోహి అనే తైలవర్ణ చిత్రకారుడు. క్రీ.శ. 1764లో పై గోడలపై ఆయన చిత్రించిన కుడ్య చిత్రాలు మనసుల్ని లీనం చేసేస్తాయి. నగార శైలిలో నిర్మించిన ఈ కట్టడాలే శ్వేత స్వప్న ధామాలుగా పేరుతెచ్చుకున్నాయి. హిందూ, జైన ఆచారాల్లోని సన్నివేశాల్ని దృశ్యీకరించిన విధానం తన్మయుల్ని చేస్తుంది. ఇక్కడి సన్నపని, జాలీపనిలోని వైచిత్రి మరోచోట కనిపించకపోవడానికి కారణం శిల్పుల్ని, కళాకారుల్ని ప్రత్యేకంగా ప్రోత్సహించడమే. నగిషీతో తరిగిన పాలరాతి పొడికి సమానంగా వెండి, బంగారాల్ని ప్రకటించారట. శిల్పులు తమ చాతుర్యాన్ని ప్రదర్శించి మిగతావారి కన్నా నాజూకైన సూక్ష్మకళతో పోటీపడేవారట. ఏది ఏమైనా అంతటి గొప్ప కళాకారులు, శిల్పుల సృజనను చూడటానికి ఒక్కసారైనా దిల్వారా ఆలయాల్ని సందర్శించాల్సిందే. తోలు వస్తువులు లాంటి జీవహింసకు కారణమయ్యే ఏ వస్తువునూ లోపలికి అనుమతించరు. సందర్శనకు వెళ్లేపుడు కచ్చితంగా స్నానాదికాలు పూర్తిచేసుకోవాల్సిందే. ఫొటోలు తీసేందుకు ఏ పరికరాన్ని అనుమతించరు. దిల్వారా ఆలయాలకు దారితీసే మార్గం ఇరువైపులా ఉండే అలంకరణ వస్తువుల దుకాణాలు కూడా ఆకట్టుకుంటాయి.

– జేఎస్సీ

వైవిధ్యానికి నిలువుటద్దం

అటు రంగస్థలాన, ఇటు చిత్ర జగత్తున నటనలో వైవిధ్యానికి అద్దం పట్టిన గొప్ప నటుడు చిలకలపూడి సీతారామాంజనేయులు ఉరఫ్ సి.యస్.ఆర్. ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా మచిలీపట్నం తెలుగు ప్రేక్షకులకు అందించిన మరో కళా బహుమానం సి.యస్.ఆర్.. 1907 జూలై 11న జన్మించిన సి.యస్.ఆర్. చదువు సంధ్యల కంటే సంగీత సాహిత్యాల మీదనే మక్కువ పెంచుకున్నాడు. బందరులో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎవరైనా రంగస్థల కళాకారులు వస్తే తిరిగి వారు మకాం మార్చే వరకు ఆ నటీనటుల్నే గమనిస్తూ వారితో ఉండిపోయేవాడు.

అభిమానధనుడైన సి.యస్.ఆర్. ఆర్థిక ఇబ్బందులున్నా ఎవర్నీ చేయి చాచి అడగడానికి ఇష్టపడక చిన్నతనంలోనే చదువుకి స్వస్తి చెప్పి నాటకాల వైపు మొగ్గు చూపించేవాడు. రంగస్థలం మీద అనతి కాలంలోనే పలువురు పండిత పామరుల ప్రశంసల్ని పొందగలిగాడు. ఆ రోజుల్లో గొప్ప రంగస్థల కళాకారులైన స్థానం నరసింహారావు, డి.వి.సుబ్బారావు, పారుపల్లి, అద్దంకి, కొచ్చర్ల కోటలతో సమానంగా రంగస్థలం మీద తనదైన ప్రతిభా పాటవాన్ని చూపి శభాష్ అనిపించుకున్నాడు. ఆయనలో వున్న గొప్పతనం శృతిపక్వంగా పాడటం. ఎంత హెచ్చు స్థాయికి శృతి పెంచినా నిరాఘాటంగా పాడగలగడం. వాచకం విడమరిచి స్పష్టంగా చెప్పగలగడం. మొదటి పంక్తిలో కూర్చున్న ప్రేక్షకుడు మొదలు, చివరి పంక్తిలో కూర్చున్న ప్రేక్షకుని వరకు సుస్పష్టంగా వినిపించడం. సి.యస్.ఆర్. మాటకీ పాటకీ వన్స్‌మోర్‌లు పలకడం పరిపాటైపోయింది.

వెండితెర వెలుగు

సి.యస్.ఆర్‌ది పౌరాణిక నాటకాల్లో అందె వేసిన చేయి గనుక సినిమాల్లో ప్రవేశించిన తొలి రోజుల్లో ద్రౌపది వస్త్రాపహరణంలో శ్రీకృష్ణుడి పాత్ర, బాలాజీ చిత్రంలో వెంకటేశ్వర స్వామి, రామ పాదుకా పట్టాభిషేకం చిత్రంలో శ్రీరాముడిగా అవకాశాలు దక్కాయి. ముఖ్యంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలకు పెట్టింది పేరుగా నిలిచాడు. 'తుకారం' చిత్రంలో తుకారం పాత్రని అద్భుతంగా పోషించాడు. విశేషమేమిటంటే తన పాట తనే పాడుకొనేవాడు. ఆ పాటలు జనరంజకంగా ప్రభవించేవి. 1932లో రామ పాదుకా పట్టాభిషేకంతో ప్రారంభమైన ఆయన నట జీవితం వరుసగా సుమతి, మాయాలోకం, రామ పాదుకా పట్టాభిషేకం, రత్నమాల, జీవితం, పరమానంద శిష్యుల కథ, పాతాళ భైరవి, పెళ్ళిచేసి చూడు, ప్రేమ, చండీరాణి, దేవదాసు, కన్యాదానం, చక్రపాణి, కన్యాశుల్కం, రోజులు మారాయి, భలే రాముడు, చిరంజీవులు, భాగ్య రేఖ, మాయాబజార్, సువర్ణ సుందరి, అప్పుచేసి పప్పు కూడు, ఇల్లరికం, అన్నపూర్ణ, మహాకవి కాళిదాసు, భక్త కుచేల, జగదేకవీరుని కథ, చిట్టి తమ్ముడు, బొబ్బిలి యుద్ధం వంటి చిత్రాల్లో ఆయన నటన అద్భుతం. ఫలానా సినిమాలో సి.యస్.ఆర్ పాత్ర బాగోలేదన్న మాట పడకుండా నెగ్గుకొచ్చాడు.

రంగస్థలం పట్టునిచ్చింది

ఆ రోజుల్లో నటీనటులంతా ఒకే కుటుంబంలా కలిసి మెలిసి వుండేవారు. వారి మధ్య భేషజాలకు తావుండేది కాదు. సి.యస్.ఆర్. రంగస్థలం మీద 'శ్రీ కృష్ణతులాభారం' నాటకంలో శ్రీ కృష్ణుడిగా, 'భక్త రామదాసు'లో రామదాసుగా, 'సారంగధర'లో సారంగధరునిగా 'చింతామణి'లో భవానీ శంకర్, బిల్వమంగళుడిగా, 'సతీసావిత్రి'లో సత్యవంతునిగా కొన్ని వందల ప్రదర్శనలు ఇవ్వడంతో డైలాగుల మీద మంచి కమాండ్ ఏర్పడింది. డైలాగ్ మాడ్యులేషన్ విషయంలో ఎవరూ జోక్యం చేసుకునేవారు కాదు. మాయాలోకం, ద్రౌపదీ వస్త్రాపహరణం, మాయాబజారు, కన్యాశుల్కం, రోజులు మారాయి, పెళ్ళిచేసి చూడు, చండీరాణి, దేవదాసు చిత్రాల్లో పాత్రలని అమితంగా ఇష్టపడతానని ఆయన

చెప్పేవారు.

సి.యస్.ఆర్ మార్క్

భక్త కుచేల చిత్రంలో సి.యస్.ఆర్. పోషించిన కుచేల పాత్ర మరిచిపోలేనిది. హాస్యం మేళవించిన విలన్ పాత్రలో రాజనాల సహాయకుడిగా 'జగదేక వీరుని కథ'లో సి.యస్.ఆర్. నటనను మరిచిపోగలమా? రాశి కంటే వాసికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే పాత్రల్లో నటించడంతో ఆ పాత్రలు పూర్ణాయుష్షుని పొంది ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. రామపాదుక పట్టాభిషేకం చిత్రంలో రాముడిగా తొలి చిత్రంతోనే పలువురి ప్రశంసల్ని పొందాడు. బాలాజీ చిత్రంలో వేంకటేశ్వర స్వామిగా నటించి దర్శక నిర్మాత పి.పుల్లయ్యకి కాసుల వర్షం కురిపించాడు. పెళ్ళి చేసి చూడు చిత్రంలో కూడా ఆ పాత్రకి మరొకరు సాటిరారన్నట్టుగా చేశాడు. మాయాబజారులో శకుని పాత్ర చేసి ఆ పాత్రకే ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచాడు. అప్పుచేసి పప్పు కూడు చిత్రంలో ఎస్.వి.ఆర్.కి సమానంగా నటించాడు. దేవదాసు చిత్రంలో దేవదాసు పాత్రధారి అక్కినేని, పార్వతి పాత్రధారి సావిత్రి తర్వాత చిరకాలం గుర్తుండిపోయే పాత్ర సావిత్రి భర్తగా సి.ఎస్.ఆర్. పోషించిన జమీందారు పాత్ర, 'కన్యా శుల్కం' చిత్రంలో గోవిందరాజుల సుబ్బారావు సరసన మధురవాణి సావిత్రి కాంబినేషన్‌లో రామప్ప పంతులు పాత్రకి ప్రాణ ప్రతిష్ఠ చేశాడు. మధురవాణిగా సావిత్రి నటన ముందు తేలిపోకుండా నిలవగలిగాడు. అది సి.యస్.ఆర్. ప్రత్యేకత!



పెద్ద మనసు

సి.యస్.ఆర్ పరిపూర్ణమైన నటుడు కాబట్టి తోటి నటీనటుల్లో కనిపించిన ప్రతిభావిశేషాల్ని ఎటువంటి భేషజాలకు పోకుండా పొగిడేవాడు. మాయాబజారు చిత్రంలో మొట్టమొదట శ్రీకృష్ణుడి పాత్రని సి.యస్.ఆర్‌తో గాని, ఆనాటి రంగస్థల, సినీ కళాకారుడు రఘురామయ్యతో గానీ వేయించాలని అనుకున్నారు. కమలాకర కామేశ్వరరావు బృందం యన్.టి.ఆర్ అయితే బావుంటుందని అభిప్రాయపడటంతో సి.యస్.ఆర్. కూడా వారి మాటకే గౌరవం ఇచ్చాడు. యన్.టి.ఆర్. స్ఫురద్రూపం గురించి అందరికీ వివరించేవాడు. దేవదాసు చిత్రం నాటికి పద్నాలుగేళ్ల వయసున్న సావిత్రి నటన ఎంత పరాకాష్టకు చేరిందీ కనిపించిన వారందరికీ గొప్పగా చెప్పేవాడు. సెట్‌లో ఎవరు బాగా నటించినా ముఖం మీదే అందరి ముందు పొగుడుతూ వుండేవాడు. నిజాన్ని నిర్భయంగానూ చెప్పేవాడు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందర్నీ ప్రేమగా చూడటం ఆయన నైజం.

పానగళ్ పార్కు... పాండీ బజార్...

నిజంగా అది స్వర్ణ యుగమే. సెట్‌లో అద్భుతమైన పాత్రల్ని పోటాపోటీగా పోషించి సాయంత్రం ఆరు దాటాక పానగళ్ పార్కులో సిమెంట్ బెంచీల మీద మకాం. వేడివేడి మిరపకాయ బజ్జీలు, బెల్లం జిలేబీ ఇష్టంగా తినడమే కాక తనతో ఉన్న వారందరికీ రుచి చూపించడం అలవాటు. బెంగాలీ బాబులా లాల్చీ పైజామాతో కనిపించే సి.యస్.ఆర్. చిరునవ్వుతో మధ్య మధ్యలో చతురోక్తులతో సాగే సంభాషణలతో సమయం ఇట్టే గడిచిపోయేది మిత్రులకి. అక్కడి నుంచి పాండీ బజారుకొచ్చి గీతా కేఫ్‌లో కాఫీ తాగి, ఆంధ్రా పాన్‌షాప్‌లో జర్దా పడితేనే కానీ రోజు పూర్తయ్యేది. సి.యస్.ఆర్ మంచి చమత్కారి. ఎవరైనా తల పొగరుగా మాట్లాడితే అంతకంటే తలపొగరుగా జవాబు వచ్చేది. సి.యస్.ఆర్. ఈ విషయంలో కొన్ని సినిమాలు వదులుకోవాల్సి వచ్చింది కూడా. షూటింగులు లేని సమయంలో ఉదయం తొమ్మిది నుంచి రాత్రి పది గంటల వరకు ఆయనింట సందడే సందడి. షూటింగ్ లేక ఇబ్బంది పడుతున్న వారికి నెలకు సరిపడా గ్రాసం కింద వందో రెండు వందలో ఇచ్చేవాడు. రేపటి గురించి అసలు ఆలోచించేవాడు కాదు. మనిషి కలకాలం బతకాల్సింది ప్రజల గుండెల్లో భూమ్మీద కాదు అనేవాడు. ఆ మాటను నిజం చేసి సినీ జగత్తు ఉన్నంత కాలం తన పేరు గుర్తుండిపోయేలా ముద్ర వేసి 1963 అక్టోబరు 8న సి.యస్.ఆర్. మరణించాడు.

ఇమంది రామారావు
9010133844

నిమిషానికి 20 తుమ్ములు

వింత లోకం

టెక్సాస్‌కు చెందిన కేట్‌లిన్ తోర్న్‌లీ అనే బాలికకు ఓ వింతైన సమస్య వచ్చింది. ఆమెకు నిమిషానికి 20 సార్లు తుమ్ములు వస్తున్నాయట. అంటే రోజుకు 12000 తుమ్ములు. కారణమేంటో తెలీక వైద్యులు కూడా చేతులు ఎత్తేశారు. కొందరు వైరస్‌లు అని, కొందరేమో ఎలర్జీ అని రకరకాల మందులిచ్చినా ఏ మాత్రం ఫలితం ఇవ్వడంలేదు. క్లారినేట్ విద్యార్థి అయిన కేట్‌లిన్‌కు 12 ఏళ్లు. అతిగా తుమ్మడం వల్ల కడుపు నొప్పి, కాళ్లు పీకేస్తున్నాయట. ఊపిరితిత్తుల పై భారం ఎక్కువవడంతో ఈమె భవిష్యత్తు ఏమిటోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అకస్మాత్తుగా వచ్చిన ఈ సమస్య అస్సలు తగ్గడంలేదు. నిద్రలో మాత్రం తుమ్ములు రాకపోవడంతో ప్రస్తుతానికి నిద్ర మత్తు కలిగించే మందు లిస్తూ నెట్టుకొస్తున్నారు. ఏంటో ఈ వింత సమస్యలు.

ఓరి.. ఒరిగామి కారా!

ఒరిగామి.. అదేనండోయ్ కాగితం ముక్కల్ని మడిచి ఆకృతుల్ని తయారుచేసే కళతో ఏకంగా నడిచే కారునే తయారుచేసేశారు లండన్‌లో. ఓ ప్రఖ్యాత కార్ల తయారీ కంపెనీ తన సెడాన్ మోడల్ ఎలక్ట్రిక్ కారును ఇలా అట్టముక్కలతో రూపొందించింది. అది సర్రున దూసుకుపోతోంది కూడా.మరో ప్రత్యేకత ఏమిటంటే లోపలి ఇంటిరీయర్ డిజైన్ మహాద్భుతంగా అట్టముక్కల భాగాలతో తయారుచేయడం. 10 మి.మీ. ఉన్న 1700 కార్డుబోర్డు ముక్కలతో స్టీల్, ఫైబర్ ఫ్రేమ్‌లపై పక్కా కారును సిద్ధం చేశారు. ఇదంతా ఎందుకంటే తమ కంపెనీ ఉద్యోగుల్లో టకుమీ అనే బృందం ఒరిగామితోనే డిజైన్లను అతి చక్కగా మలుస్తుంది. వాటం లేని చేతితో వాళ్లు ఒరిగామి పిల్లి ఆకృతిని రూపొందించారు. వీరికి అభినందనలు తెలిపేందుకే కార్ల కంపెనీ ఇలా లండన్‌కు చెందిన డిజైనింగ్ కంపెనీలతో కలసి ఈ కారును రోడ్డెక్కించింది.

గోళ్లతో గిన్నిస్ రికార్డు

పూణెకు చెందిన శ్రీధర్ చిల్లై ఎడమ చేతి గోళ్లతో గిన్నిస్ బుక్ ఎక్కేశాడు. 63 ఏళ్లుగా గోళ్లను కత్తిరించకుండా అన్ని గోళ్లు కలుపుకుని యావరేజీగా 909.6 సెం.మీ. కొలతలకు పెంచాడు. బొటనవేలి గోరైతే ఏకంగా రెండు మీటర్లు పెరిగింది. చిన్నప్పుడు ఎపుడో బడి పంతులు ముద్దుగా పెంచుకున్న గోరు అనుకోకుండా శ్రీధర్ మిత్రుల వల్ల విరిగిపోయిందట. వారిని చితకబాదిన మాస్టార్ని నిలదీస్తే గోళ్లు పెంచి చూడు నీకే తెలుస్తుంది ఆ బాధేంటో అని అన్నాడట. అప్పటి నుంచి శపథం చేసిన శ్రీధర్ గోళ్లను పెంచడం మొదలెట్టాడు. అవి మరీ పెరిగి పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. పెళ్లి సంబంధాలు దొరక్క పోయేసరికి కుడిచేతి గోళ్లను కత్తిరించుకున్నాడు. ఇలా ఎట్లా అయితేనేం ప్రపంచంలో పొడగాటి గోళ్లను పెంచి రికార్డు సృష్టించాడు. 80 ఏళ్లు నిండటంతో మరీ ఇబ్బంది అయి కత్తిరించుకునే యోచనలో ఉన్నాడట.

మట్టి హోటళ్లు

డచ్ నగరాలు ఓస్, స్నీక్‌లు సరికొత్త ఆతిథ్యానికి ఆహ్వానం పలుకుతున్నాయి. చిన్నారులు కట్టుకునే ఇసుక గూళ్లనే కాస్త గట్టిగా పెద్దగా కట్టేసి హోటళ్లుగా మార్చేశారక్కడ. ఓ ఉత్సవంలో భాగంగా నిర్మించిన ఈ విడిది కేంద్రాలు తాత్కాలికంగానే నడిపారు. ఫ్లింట్‌స్టోన్స్ కార్టూన్‌లోని బెడ్రూమ్‌ల్లా, చైనా టెర్రకోట బొమ్మలు, గోడ శైలిలో కొన్ని నిర్మాణాలు ఇలా వివిధ శైలుల్లో వాటిని కట్టి ఆశ్చర్యపరిచారు. సన్నని కాంక్రీట్ గోడలపై నిలబెట్టిన ఈ హోటల్ గదులన్నీ బుకింగ్ తెరిచిన వెంటనే అమ్ముడుపోయాయి. మట్టి కట్టడాలని వసతి ఏర్పాట్లు ఎలా ఉంటాయోనని అనుకోకండి స్టార్ హోటళ్లలో ఉండే అన్ని సదుపాయాల్ని సర్దేశారిక్కడ.



ఆ తల్లులకు మోకరిల్లుతున్నాను!

వారే నా గురువులు!

కడలి అంచునే నడుస్తున్నపుడంతా
నక్షత్రాల పందిరి కింద వెలుగుల సవ్వడి
కడలి మధ్యంతరంలో నిశ్చలంగా ఉంది.
దానిపై వస్తున్న నావ సుదూరంగా...
ఆ ఒడ్డునే నిలబడిందెవరు?
చాటంత కళ్లతో ఆ పడవ రాక కోసం
ప్రకృతిలోని వెన్నెలంతా ఆమె చుట్టే
ఆ సముద్రం కంటే ఈమే నిబ్బరమైంది
కదా!
ఆ లాంతరు పట్టుకుని సందేళదాక అదే
చూపు
ఆమెలోవున్న నిబ్బరం ముందు
సంద్రం ఓడిపోలేదంటారా!
ఆ దక్షిణం వైపు నుండి వచ్చిన తెమ్మెర
ఆ ఆచ్ఛాదనం లేని
బుడ్డోణ్ని రాబోయే భవిష్యత్తుకు
సన్నద్ధం చేయడం లేదా!
ఆ అపార్ట్‌మెంట్‌లో అరుస్తున్న ఆ కుక్క
గొలుసులతో బంధించబడింది.
ఆ శునకం అరుపుల మధ్య
ఆమెవరో మూలుగుతోంది
కుండీలో దోసెడు నీళ్ళు పోస్తే
ఆ క్రోటాను ఆ ఇంటికి అందం తెస్తుంది
ఆ చేత్తో ఆమె ఏ పచ్చనాకు తడపలేదు
ఎందుకో
ఆ తేనె ఆ వెన్నెల, ఆ పక్షి కూత
అన్నీ ఆ మేడల్లో వ్యర్థమై పోతున్నాయి
మనసు విప్పి మాట్లాడుకునే స్వరాలు లేక
బుల్లి తెరలో తీక్షణమైన చూపులు
క్రౌర్య స్వరాలను పెద్ద ధ్వనిలో వింటున్నారు
ఆ గొర్రెల మంద వెనుకే నడుస్తున్న ఆ సుకన్య
ఆ భుజాన అప్పుడే పుట్టిన
గొర్రె పిల్లను ఎత్తుకొని వెళుతుంది.
చేతిలో కర్రపుల్లతో మందలు మందలు గొర్రెల
అదుపు
పాదాలకు చెప్పుల్లేవు
గుంతల్లో మెట్టల్లో ఆ చరణాలు
మెరుగులీనుతున్నాయి
ప్రకృతికి మెరుగులు పెడుతున్న ఈ జవ్వని ఎవ్వరు
ఆమె నములుతున్న గానుగపుల్ల
ఆ పండ్ల కాంతిని
ఇనుమడింప చేస్తుంది
సూర్య కిరణాలు ఆమెను వెన్నంటి
ఆమె జీవన సౌందర్యాన్ని పెంచుతున్నాయి
ఆత్మస్థైర్యం వున్న ఆమె పిల్లలు
కొండలను అవలీలగా ఎక్కుతున్నారు
సూర్యోదయాన్ని ఆహ్వానిస్తూ
పొలాలు, పుట్టలు దాటి నడుస్తున్నారు
అవును వారు నాట్లే వేస్తారు కోతలే కోస్తారు
నేలను 'తల్లి' అనుకొంటారు
మంచును తెల్లని తెర అనుకొంటారు
ఆ వేపచెట్టునే నమ్ముకొన్నారు
దాని నీడలో అన్నం
పంచుకు తింటారు
నిజమే అందరూ కూడి తినేదే 'కూడు' కదా!
పున్నీళ్ళు ఇంకా దక్షాది
పూరిగుడెసెల్లోని కుండల్లో
కడుపులు చల్లబరుస్తూనే ఉన్నాయి
పాలు, వెన్న, జున్ను, ఫిజా
వారి శరీరాన్ని పెంచుతున్నాయి
ఆ వేపాకు చిగురు రోజూ
కాస్తతింటున్న
అనాది జీవులకు మధుమేహాలు
లేవు
నత్తలు, పుట్టగొడుగులు,
మునగాకులు
వారిని సజీవం చేస్తున్నాయి
పుట్టినప్పుడు పుట్టిన జుత్తు అలాగే
వంకలు తిరిగి
నిగ నిగ లాడుతోంది సుమా !
నిజమే ప్రకృతి ఓ అమ్మ
దాన్ని అధ్యయనం చేసిన
జాతులన్నీ
సజీవ స్రవంతులే
మీ చెవులు చిల్లులు పడేటట్లు
మీరు అతి శబ్దాలతో బధిరులు
కాకండి!
మీరు గొర్రెల కాపరి దగ్గర
పిల్లల్ని పెంచడం నేర్చుకోండి!
మీరు పోతూ పోతూ ఇచ్చే
ఆ జీవసంపదను వారు కాపాడాలి
కదా!
ఆ బెస్త స్త్రీ దగ్గర నిబ్బరాన్ని
నేర్చుకోండి!
ఆమె పిల్లలకు ఆమె చిన్నప్పుడే
ఈత నేర్పింది కదా!
ఆ యానాదులు విషాన్ని అరాయించుకొంటున్నారు
ఆ దళిత పడతి నల్లని పొడవాటి జుత్తు
సంరక్షించుకో గలిగింది
వీరందరూ ప్రాకృతిక విద్యాధినేతలు
అక్షరాలు వచ్చిన వారు
వీరి ముందు తలదించారు సుమా!
జీవన పోరాటంలో విజేతలు
సామాజిక, ప్రాకృతిక శక్తులు, వీరే నా గురువులు
అందుకే! ఆ తల్లులకు మోకరిల్లుతున్నాను
దోసిళ్ళ బట్టి జ్ఞానార్జన చేస్తున్నాను.
ఆ పాఠశాలలో మనందరం విద్యార్థులమే

డా॥ కత్తి పద్మారావు

పిసిని గొట్టు

- ఎమ్.లత

◆ కథ



రామనాథం పేరు మీరు వినివుండరు. ఆ మాటకొస్తే ఆయన్ను నేను మాత్రం ఎరుగుదునా? ఆయన తనకు తాను వచ్చి నా పేరు ఫలానా అని చెప్పుకున్నాడు. ఆరు నెలల క్రితం ఆయన బంధు వెవరో నా దగ్గర చికిత్స పొంది ఆరోగ్యవంతుడైనాడట! ఆయన సలహా మీదనే నా వద్దకు వైద్యం చేయించుకొనడానికి వచ్చాడట!

"మీకు జబ్బేమిటో చెప్పారు కాదు"! అని అడిగాను.

రామనాథం చేతులు రెండూ జోడించి నమస్కరిస్తూ "అయ్యా ! మీరు ఫీజు ఎంత తీసుకుంటారో శెలవియ్యాలి" అని అడిగాడు.

"పది రూపాయలు"

"బాబాయో! పది రూపాయలే! అంత యిచ్చుకోలేను. డాక్టర్ గారూ! కనికరించి ఫీజు కొంచెం తగ్గించాలండీ!"

"అంత ఫీజు ఇచ్చుకోలేనంత బీదవాళ్లయితే నా కసలు ఫీజే యివ్వనవసరం లేదు! సరేనా!

రామనాథం మొహం ఒక్కసారిగా విప్పారింది! ఆ తరువాత ఏమడగాలో తెలియక గాబోలు– మీసాలు సవరించుకున్నాడు.

ఇంతలో నేను మరొక రోగిని పరీక్షించడంలో నిమగ్నమైపోయాను. ఆ తరువాత కొంతసేపటికి అతన్ని బయటికి పంపించి వేశాను. నేను రామనాథం వైపు చూశాను.

"అయ్యా డాక్టరు గారూ! మా గుడివాడలో కూడా ఎం.బి.బి.ఎస్ చదివిన డాక్టర్లున్నారండి. అయినా నేను వాళ్ళ దగ్గరకు వెళ్లకుండా బస్సుకు రూపాయిన్నర ఖర్చు బెట్టుకుని ఇక్కడికి వచ్చానండి.భోజనానికి, కాఫీ, రిక్షాలకూ అప్పుడే అయిదు రూపాయలు ఖర్చుయిపోయాయండి. ఇంటికి చేరుకునేప్పటికి మరొక అయిదు రూపాయిలయినా ఖర్చవుతాయండి. కనుక మీకు నేను రెండు రూపాయల కంటే ఎక్కువ ఫీజు యిచ్చుకోలేనండి! అని అన్నాడు రామనాథం. నా వైపు తిరిగి

"మీకంత తాహతు లేకపోతే ఆ రెండు రూపాయలు కూడా నా కివ్వనవసరంలేదు"

"మీ దగ్గర వైద్యం చేయించుకున్న మా ఊరి గుత్తా నరసయ్యగారి కిష్టయ్య మీరెంతో మంచివారని చెప్పాడండి. రోగులు ఎంత యిస్తే అంత మారు మాట్లాడకుండా తీసుకుంటారట!"

"అన్ని వస్తువుల ధరలు యిలా ఆకాశాన్ని అందుకుంటూ ఉంటే ఏదో ఒకటి తీసుకొనకపోతే గడిచేదెలాగూ?"

రామనాథం బిగ్గరగా నవ్వాడు.

"అవునండీ! ఎలా గడుస్తుందండీ? ఎంత చెట్టుకంత గాలి!... నాకూ ఏదో కాస్త పొలం, పుట్రా ఉన్నదనుకోండి. పంటలు ఈసంవత్సరం బాగానే పండినాయి. ధాన్యం ధరలు కూడా ఫరవాలేదు. అయితే..."

రామనాథం ఇంకేయేమో చెప్పబోయాడు. కాని, అప్పుడే నా పరిచితుడొకాయన గాభరాగా లోనికి ప్రవేశించాడు. అతని భార్యకు చాలా ప్రమాదంగా ఉన్నదట!

"మీరిక్కడే కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తాను" అని రామనాథంతో చెప్పి బయటికి వెళ్లిపోయాను.

నేను గంట తరువాత గాని తిరిగి రాలేకపోయాను. రామనాథం అలాగే కూర్చొని ఉన్నాడు. వసారాలో మరొక స్త్రీ కూడా కూర్చొని ఉన్నది. ఆమె ముక్కు బాగా వాచింది. రెండు కళ్ళు బాగా ఎర్రగా ఉన్నాయి. మొహం మీద ఖాళీ లేకుండా చిన్న చిన్న కురుపులున్నాయి. నన్ను చూసిన ఆ స్త్రీ లేచి పక్కకు ఒదిగి నిలబడింది.

"అయ్యా ! డాక్టరుగారూ! నేను మీకు ఐదు రూపాయలు ఇచ్చుకుంటానండి. ఇక పోతే నా జబ్బు విషయం...."

రామనాథం మీద నాకు చెప్పలేనంత కోపం వచ్చింది. కాని, నా కోపాన్ని లోలోపల దిగమింగుకొని "అయితే మీరు ఐదు రూపాయల కంటే ఎక్కువ యిచ్చుకోలేరన్నమాట!" అని అన్నాను, నవ్వుతూ!

రామనాథం కూడా నవ్వాడు.

"అయ్యా డాక్టరు గారూ! మాది కూడా చొందపాడే నండి. గుత్తా నరసయ్యగారు మా బంధువేనండి. మరి మీరు ఫీజును మరికొంచెం మాఫీ చేయించాలి.

నేను మారు మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాను. ఏమో – "సరే, డాక్టరు గారూ !ఫీజు ఆరు రూపాయలు యిచ్చుకుంటానండి!" అని చెప్పి ఆరు రూపాయలు ఒక్కొక్కటే లెక్కబెట్టి నా ముందు ఉంచాడు.

"మీ జబ్బు ఏమిటో చెప్పండి"

రామనాథం తన జబ్బును గురించిన వివరాలు చెప్పాడు. అతను చెప్పిన వివరాలను విన్నమీదట రామనాథానికి అతి మూత్ర వ్యాధి ఉన్నదని తెలుసుకున్నా. మూత్రం పరీక్ష చేశాను. షుగర్ చాలా పోతున్నట్టు తేలింది.

"ఆహారం విషయంలో మీరు ముందు వెనుక చూడరనుకుంటాను!"

"అవునండీ! నాకు తిండి విషయంలో ఎటువంటి పట్టింపులూ లేవండి. నా చిన్నతనంలో తిండిలేక అనేక బాధలు పడ్డానండి. ఇప్పటికి భగవంతుడికి నా మీద అనుగ్రహం కలిగింది. ముప్పూటలా లేదనుకోకుండా ఇంత తినగలుగుతున్నాను. తిండికి తిమ్మరాజు నేననుకోండి."

"మీరు తిండి తగ్గించాలి. ఎక్కువ తినడం వల్లనే మీకీ జబ్బు వచ్చింది."

"తిండి తగ్గించమంటారా? అదెట్లాగండీ డాక్టరు గారూ? నా చిన్నప్పుడే మా తండ్రి చనిపోయాడండి.

ఉన్న ఆస్తి అమ్మి అప్పులు తీర్చానండి. ఆ తరువాత తినీ తినక ఎంతో కష్టపడి దమ్మిడి దమ్మిడి చొప్పున నిలవచేశాను. ఇప్పటికి పరిస్థితి మెరుగయిందండీ. మీ దయవల్ల ఇంత పొలం, పుట్రా, గొడ్డు గోదా ఏర్పడ్డాయండి. తిండికి లోటు లేకుండా గడిచిపోతున్నదండీ. ఇప్పుడు తిండి మానేయమంటే ఎలాగండీ?"

"తప్పదు మరి! కొన్ని రోజులు జాగ్రత్తగా ఉండాలి. పంచదార, అన్నం, బంగాళ దుంపలు వీటిని ముట్టుకోరాదు."

"ఇవి లేకపోతే ఎలాగండి?"

"ఏం ఫరవాలేదు. ఇంజెక్షన్ ఇవ్వాలి. పైగా రక్తం కూడా పరీక్ష చెయ్యాలి. మీ రక్తంలో ఎంత పంచదార ఉన్నదో చూడాలి".

"రక్తంలో కూడా పంచదార ఉంటుందేమిటండీ?"

"ఉంటుంది. రక్తంలో పంచదార ఎక్కువగా ఉంటేనే మూత్రం ద్వారా బయటికి వస్తుంది."

"ఓహో! అలాగండీ!"

రామనాథం మీసాలను సవరించుకుంటూ "అంటే ఇంకా నాకు చాలా ఖర్చు ఉన్నదన్నమాట!" అని అన్నాడు.

"అవునవును. రక్తం పరీక్ష చెయ్యాలంటే పదహారు రూపాయిలవుతాయి. పైగా ఇంజెక్షన్ ఖర్చు అదనం. వీటితో పాటు పథ్యం ఉండాలి.

రామనాథం లేచివచ్చి నా రెండు చేతులూ పుచ్చుకొని "డాక్టరు గారూ! రక్తం పరీక్ష చేసినందుకు ఫీజు ఎనిమిది రూపాయలు తీసుకోండి. అంతకంటే ఎక్కువ నేనిచ్చుకోలేను. కనికరించాలి. నేను ముందు చెప్పాను కదండీ. ఆ గుత్తా నరసయ్య మా బంధువేనండీ!"

కనికరించక తప్పలేదు.

రక్తం తీసుకొని రామనాథాన్ని మధ్యాహ్నం రమ్మన్నాను. రక్తం పరీక్ష చేసిన తరువాతనే చికిత్స ఆరంభించాలన్నాను.

అంతవరకు వసారాలో నిల్చున్న ఆ స్త్రీ నా గదిలో ప్రవేశించి "అయ్యా డాక్టరు గారూ! నన్ను రక్షించాలి!" అని కాళ్ళ మీద పడింది.

"కాళ్ల వదులు! విషయమేమిటో చెప్పు! ఏదీ మొహమిలా తిప్పు!"

ఆమె మొహం పరీక్షగా చూశాను. రామనాథం కూడా అతి శ్రద్ధగా ఆమెను పరిశీలిస్తున్నాడు.

"ఈ జబ్బు నయం కావాలంటే చాలా డబ్బు ఖర్చవుతుంది. మరి భరించుకోగలవా?" అని అడిగాను ఆ స్త్రీని!

ఆమె పమిటచెంగు లోపలి నుంచి వెండి కడియాలు రెండు తీసి నా ముందు ఉంచింది.

"నా దగ్గరున్న ఆస్తి యిదేనండి! ఇవి తీసుకుని నా జబ్బు ఎలాగైనా నయం చేయండి డాక్టరు గారూ!

"ఈ కడియాలు నేనేం చేసుకోను? నువ్వు నాకేమీ యివ్వనవసరం లేదులే మందుల ఖర్చు మాత్రం భరించుకో!"

"మందులు ఎంతవుతాయండి?"

"యాభై రూపాయల మందులు కావాలి. పైగా రక్త పరీక్ష కూడా చేయించుకోవాలి."

"రక్త పరీక్షకు ఎంతవుతుందండీ?"

"ఆ డబ్బు కూడా నేను వదులుకుంటాను. మందులు మాత్రం కొనుక్కో!"

ఆ స్త్రీ కన్నీళ్లు కారుస్తూ నిలబడిందే గాని మారు మాట్లాడలేదు.

"ఈ కడియాలు ఎంత ఉంటాయి?"

"ఎప్పుడో చాలాకాలం కిందట ముప్పై రూపాయలకు కొన్నానండి!"

"వీటిని ఇప్పుడు అమ్మితే పది రూపాయలు కూడా రావు!" అన్నాడు రామనాథం.

ఆ స్త్రీ మరల నా కాళ్ళ మీద పడడానికి ప్రయత్నించింది.

నువ్వెళ్ళి వసారాలో కూర్చో! నీ కేసు విషయం కొంచెం తీరికగా ఆలోచిస్తా లేకపోతే పెద్ద ఆసుపత్రికి ఉత్తరం రాసియిస్తా, తీసుకెళ్లు!"

"అక్కడికి వెళ్ళి వచ్చానండి. వాళ్ళు కూడా డబ్బు అడిగారండి!" అని చెప్పింది. ఆమె కళ్ళ వెంట కన్నీరు ధారలుగా ప్రవహిస్తున్నది.

"ఏడ్చి ప్రయోజన మేముంది చెప్పు? వెళ్ళి బయట కూర్చో! మళ్ళీ పిలుస్తాను."

శాంపిల్ మందులు ఏమైనా ఉన్నాయేమోనని అటూ యిటూ చూస్తూ ఉండగా రామనాథం నా వైపునకు తిరిగి

"అయ్యా డాక్టరు గారూ! యాభై రూపాయలుంటే ఆమె ఆరోగ్యం బాగుపడుతుందంటారా?"

"ఆ (... బాగుపడుతుంది."

రామనాథం మీసాలను సవరించుకుంటూ కొంచెం సేపు ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"డాక్టరు గారూ! డబ్బు నేను పెట్టుకుంటాను. ఆమెకు చికిత్స ప్రారంభించండి."

"డబ్బు మీరిస్తారా?"

నే నడిగినదానికి రామనాథం సమాధానం చెప్పకుండా అవతల గోడకు అనించి ఉంచిన సంచీ చేతిలోకి తీసుకుని దానిలోంచి అయిదు పదేసి రూపాయల నోట్లను బయటికి తీశాడు. తీసి నా చేతి కందించాడు.

"డాక్టరు గారూ! ఈ డబ్బు ఉన్నది చూశారు. చాలా పాపిష్టిదండీ! ఈ పాపిష్టి డబ్బే నన్ను నాశనం చేసింది."

రామనాథం ఇంతటి వేదాంతపరమైన విషయం మాట్లాడతాడని నే నూహించుకోలేకపోయాను. పై పెచ్చు నా కెందుకో ఒక సందేహం కూడా కలిగింది.

"ఆమె మీకేమైనా బంధువా?"

"అబ్బే లేదండి?".... అయితే " రామనాథం అటూ ఇటూ చూశాడు.

"విషయమేమిటో చెప్పండి!"

"విషయమేమీ లేదండి! ఆమె మొహంలో మా తల్లి పోలికలున్నాయండి!"

"మా నాన్న చనిపోయన మాసం రోజులకే మా అమ్మ కూడా కన్ను మూసింది. మా అమ్మకు జబ్బు చేస్తే డాక్టరుకు చూపించే తాహతు లేకపోయింది. అన్నాడు రామనాథం నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టు!

నా ఆశ్చర్యానికి మేరలేకపోయింది. రామనాథం వైపు తదేకంగా చూశాను. అతని నేత్రాలు అశ్రు మయమైనాయి.

(1963, నవంబర్ నాటి కథ)

✦

జిమ్‌కు వెళితే తప్పేంటి?

సిక్స్ ప్యాక్‌లు మగాళ్లకేనా అని ప్రశ్నించినపుడే శ్వేత రాథోర్ ఏం చేయబోతోందో పసిగట్టేశారు జిమ్ ట్రైనర్లు. వాళ్లనుకున్నట్టే ఆమె ఆసియా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి రజత పతకాన్ని తెచ్చింది.

ఢిల్లీకి చెందిన శ్వేత రాథోర్ 54 కేజీల బరువు, 5.4 అడుగుల ఎత్తు, 24 అంగుళాల నడుము కొలతలతో తీరైన దేహం గల పాతికేళ్ల భారత మహిళా బాడీబిల్డర్, పర్‌ఫెక్ట్ మిస్ ఫిట్‌నెస్ ఫిజిక్ మోడల్. అంతర్జాతీయ వేదికలపై కండలు బిగిస్తున్న మన దేశ అమ్మాయిలకు మరింత బలాన్నిచ్చింది. ఇటీవలే ఉజ్బెకిస్తాన్‌లో నిర్వహించిన ఆసియా పోటీల్లో ఆమె విజయం. మహిళ దేహ దారుఢ్య ప్రదర్శనా అంటూ సాంప్రదాయవాదులు గగ్గోలు పెట్టినా ఆమె వ్యాయామం ఆపలేదు. పన్నెండేళ్ల వయసులోనే తండ్రిని జిమ్‌కు వెళతానని కోరగా అడ్డంగా తలూపాడు. తల్లి, అన్నలు ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె వ్యాయామ శాల గడప తొక్కగలిగింది. ఉదయం, సాయంత్రం ఇంటి వద్ద వ్యాయామం చేస్తూ మధ్యాహ్న వేళల్లో ఇంటికి దగ్గరలోని జిమ్‌కు వెళ్లేది. ఆ సమయంలో జిమ్‌లు మూసివేస్తారు కనుక అబ్బాయిలతో వచ్చే ఇబ్బందేమి లేదని జిమ్ యజమాని తాళాన్ని చేతికి అందించేవాడు. ట్యూషన్‌కు వెళుతున్నానని తండ్రికి చెప్పి వెళ్లి కసరత్తులు చేసేది. ఇంజనీరింగ్ కూడా పూర్తి చేసుకున్న శ్వేత దేహ దారుఢ్యాన్ని చూసి వివిధ పోటీలకు ఆహ్వానాలు అందేవి. తండ్రి సైతం శ్వేత తపనను అర్థం చేసుకుని ప్రోత్సహించాడు. శ్వేతది ఫిట్‌నెస్ మోడల్ శ్రేణి పోటీ కావడంతో ఆమె దేహం ఎక్కువగా కనిపించేలా ప్రదర్శన ఇవ్వాలి. సంప్రదాయవాదులకు ఇది మింగుడు పడలేదు. ఎక్కడో విదేశాల్లో ఈ తరహా పోటీలకు ఇక్కడి ఆచారాల్ని మార్చుకోవ డమేమిటని పలు దూషణలతో వేధించేవారు. వారి నోళ్ల నొప్పి పుట్టేలా ఏకంగా దేశంలోనే తొలిసారిగా మహిళా బాడీ బిల్డింగ్ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించింది సమాఖ్య. శ్వేత రాథోర్ లాంటి భారత బిల్డర్లు స్టేజీపై కనిపించగానే ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు రావడంతో ఇక ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటింది. 'గాడ్స్ బ్యూటిఫుల్ చిల్డ్రన్' అనే సామాజిక వేదికను ఏర్పాటు చేసి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌లపై మహిళల్లో చైతన్యం తెస్తోంది. తొలి మహిళా బాడీ బిల్డింగ్ అకాడెమీని స్థాపించి మరికొందరు శ్వేతల్ని తయారుచేస్తోంది. 450 కేజీల బరువులతో సాధన చేస్తూ కటువైన దేహాన్ని రూపొందించు కుంటూనే స్త్రీ దేహ సౌందర్యంలోని ప్రత్యేకతని కాపాడుకుం టున్నానని గర్వంగా చెప్పే శ్వేత విజయం మహిళపై కొందరి తృణీకరణ భావనకు చెంప పెట్టే. వీళ్లు దీనికే పరిమితమనే ఆలోచనుంటే కాస్త ఆలోచన దృక్పథాన్ని మార్చుకోమని తన మాటగా చెబుతోంది.

✦

రుచి

సెనగపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

సెనగపప్పు– ఒక కప్పు, సగ్గుబియ్యం–కాసిని, బెల్లం– రెండు కప్పులు, పాలు– ఒకటిన్నర కప్పు, నేతిలో రుచి కోసం–వేయించిన జీడిపప్పు, ఎండు ద్రాక్ష, యాలకులు– రుచికి సరిపడా.

తయారీ

సెనగపప్పు సగ్గుబియ్యాన్ని కలిపి నీటితో ఉడికించుకోవాలి. ఇప్పుడు పాలల్లో కాసిని నీళ్ళు చేర్చి పొయ్యి మీద పెట్టాలి. అవి మరుగుతున్నప్పుడు ముందుగా ఉడికించి పెట్టుకున్న సెనగపప్పు, సగ్గుబియ్యాన్ని వేసేయాలి. రెండు నిమిషాల తరువాత బెల్లం తురుము కూడా చేర్చాలి. పాయసం దగ్గరగా అవుతున్నప్పుడు వేయించి పెట్టుకున్న జీడిపప్పు, ఎండు ద్రాక్ష పలుకులను చేర్చితే సరిపోతుంది. మరింత చిక్కగా కావాలనుకుంటే రెండు చెంచాల గోధుమపిండితో కాసిని నీళ్ల చేర్చి పాయసంలో వేసుకోవచ్చు.

ధాన్యాల లడ్డు

కావాల్సిన పదార్థాలు

సెనగపప్పు, మినపప్పు, కందిపప్పు, బియ్యం, పెసలు, ఉలవలు, బొబ్బర్లు, గోధుమలు, తెల్ల నువ్వులు అన్నీ సరిసమానంగా కలిపి కప్పు, యాలకుల పొడి–చెంచా, పంచదార, బెల్లం తురుము– రెండు కలిపి ఒకటిన్నర కప్పు, నెయ్యి– లడ్లు చుట్టడానికి సరిపడా.

తయారీ

పైన పేర్కొన్న ధాన్యాలను ఒక్కొటి చొప్పున బాణలిలో నూనె లేకుండా వేయించి పెట్టుకోవాలి. ఇప్పుడు వాటన్నింటినీ మెత్తగా పొడి చేసుకోవాలి. అందులో బెల్లం, పంచదార కలిపిన మిశ్రమం, యాలకుల పొడిని చేర్చి మరోసారి కలపాలి. ఇప్పుడు కరిగించిన నెయ్యిని చేర్చుకుంటూ లడ్లు చుట్టుకోవాలి. ఇలా చేసుకున్నవి నిల్వ ఉంటాయి.

పాల ముంజలు

కావాల్సిన పదార్థాలు

సెనగపప్పు– పావు కేజీ, బెల్లం– పావు కేజీ, యాలకులు– నాలుగు, బొంబాయి రవ్వ– పావుకేజీ, ఉప్పు– కొద్దిగా, పాలు, నీళ్ళు– పావు లీటరు చొప్పున, నూనె– వేయించడానికి సరిపడా, బెల్లం పొడి– చెంచా.

తయారీ

సెనగపప్పును కుక్కరులో తీసుకుని సరిపడా నీటిలో మూడు కూతలు వచ్చే వరకు ఉడికించుకోవాలి. ఆ తరువాత నీళ్ల వంపేసి బెల్లం తురుము చేర్చి పొయ్యి మీద పెట్టి.. దగ్గర పడేదాకా ఉడికించాలి. చివరగా యాలకుల పొడి కలిపి దింపేయాలి. ఈ మిశ్రమం చల్లారాక ఉండల్లా చేసుకోవాలి. ఇప్పుడు పాలు,నీళ్ల ఓ పాత్రలో తీసుకుని పొయ్యి మీద పెట్టి బొంబాయి రవ్వ కలపాలి. కొద్దిగా ఉప్పు, బెల్లం పొడి వేసి మంట తగ్గించి కలుపుతూ ఉండాలి. మిశ్రమం దగ్గరగా అయ్యాక దింపేయాలి. ఇది చల్లారాక కొద్దిగా బొంబాయి రవ్వ పిండిని తీసుకుని చేత్తో అప్పడంలా వత్తి అందులో సెనగపప్పు ఉండను ఉంచి. చుట్టూ మూసేయాలి. ఇలా వేసుకున్న వాటిని కాగుతోన్న నూనెలో బంగారు వర్ణంలోకి వచ్చేదాకా వేయించి తీసుకోవాలి.

మిహిదానా లడ్డు

కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి, సెనగపిండి– కప్పు చొప్పున, నెయ్యి– వేయించడానికి సరిపడా, పంచదార– రెండు కప్పులు, నీళ్లు– కప్పు.

తయారీ

ఓ పాత్రలో నీళ్ల పంచదార తీసుకుని ముదురుపాకం పట్టుకోవాలి. మరో పాత్రలో బియ్యప్పిండి సెనగపిండిని గరిటె జారుగా కలుపుకోవాలి. బాణలిలో నెయ్యి కరిగించి సెనగపిండి మిశ్రమాన్ని సన్నని జాలి ఉన్న గరిటెలోంచి వేసి వెంటనే తీసేయాలి. ఇలా చేసుకున్న సన్న బూందీని పంచదార పాకంలో వేసుకోవాలి. ఇది కాస్త పల్చగానే ఉంటుంది. దీన్ని ఉండల్లా చుట్టుకోవాలి.

బెల్లం రసగుల్లా

కావాల్సిన పదార్థాలు

ఆవు పాలు– రెండున్నర లీటర్లు, పంచదార– కేజీ, బెల్లం– కేజీ, నిమ్మరసం– కప్పు, మైదా– పావు కప్పు

తయారీ

పాలను మరిగించి నిమ్మరసం వేస్తే విరిగిపోతాయి. ఆ నీటిని ఒంపేసి ఆ మిశ్రమం పై గట్టి బరువును ఉంచాలి. రెండు మూడు గంటలయ్యాక పన్నీర్ తయారవుతుంది. ఇందులో మైదా కలిపి గట్టి మిశ్రమంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండల్లా చేసుకోవాలి. ఇప్పుడు పంచదార, బెల్లాన్ని సరిపడా నీటిలో తీసుకుని కరిగించాలి. లేత పాకం వచ్చాక ముందుగా చేసి పెట్టుకున్న పన్నీర్ ఉండల్ని అందులో వేసి ముప్పావు నుంచి గంట వరకు పొయ్యి మీద పెట్టాలి. చిక్కగా మారాక తీసేస్తే సరిపోతుంది.

బొమ్మ గీద్దామా

ఈ వారం ఆర్టిస్టు అంకుల్ పిచుక బొమ్మను ఎలా గీయాలో నేర్పిస్తాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండి.



కత్తిరించి అతికించండి

ఈ చిత్రంలోని అమ్మాయికి కళ్ళు, నోరు, పెదవులు అమర్చి అందమైన అమ్మాయిగా తయారుచేయండి.



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోని . ఇది నా చిన్ననాటి ఫోటో..నేనెవరో కనిపెట్టి చెప్పండి.!

జవాబు : ప్రభాస్

భిన్నమైనది?

ఈ చిత్రంలో జోకర్ మామ అందరిని నవ్విస్తూ అల్లరి చేస్తున్నాడు అయితే అతనిలా మరొకరు చేరారు. అతన్ని గుర్తించండి.



తేడాలు కనుక్కోండి

ఈ చిత్రంలో కుందేలు చాలా అందంగా తయారైంది కదూ. అయితే ఇందులో పది తేడాలు ఉన్నాయి వాటిని గుర్తించండి.



ఎన్ని రబ్బర్లు పోగుచేశాడో...

బొమ్మ వేయాలంటే పెన్సిల్, రబ్బరు, కాగితం కావాలి. ఎక్కడైనా తప్పు పోతే సరిచేయడంలో రబ్బరు (ఎరేజర్) భలేగా పనికొస్తుంది కదూ. అందుకే మీలాంటి చిన్నారులందరికీ రబ్బరంటే అంత ఇష్టం. మీలాంటి అబ్బాయే మేథ్యూ. ఈ బ్రిటిష్ పిల్లాడు లాంక్‌షైర్‌లో వైట్‌చాపెల్ ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్నాడు. ఈ పిడుగు దగ్గర ఎన్ని రబ్బర్లు వున్నాయను కుంటున్నారు. ఒకటి..రెండు...కాదు. ఏకంగా 3,500 వున్నాయి. కుటుంబంతో కలిసి విదేశీ యాత్రలకు వెళ్లినప్పుడు కొన్నవి, బంధుమిత్రులు బహూకరించినవి, ఇంటర్నెట్ ద్వారా కొన్నవే అవన్నీ. వాటిని బుట్టల్లో చక్కగా సర్ది దాచి పెట్టాడు. ఎప్పుడైనా నేస్తాలు ఇంటికి వచ్చినప్పుడు వాటిని బైటికి తీసి చూపించి ఆడుకుంటూ వుంటాడు. ఇంతకీ ఇన్ని రబ్బర్లు ఎందుకు సేకరించాడను కుంటున్నారు? గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలనే. కాకపోతే దానికి ఇంకా చాలా సమయం పట్టేలా వుంది. ఎందుకంటే ఇప్పటికే ఓ జర్మన్ మహిళ దగ్గర 19,000 రబ్బర్లున్నాయి. అంతకంటే ఎక్కువ పోగు చేస్తేనే ఆ రికార్డును బద్దలు కొట్టి కొత్త రికార్డు స్థాపించడానికి వీలౌతుంది. ఆ పనిలో వున్నాడు మనోడు. అందుకోసం ఎంత డబ్బు ఖర్చు చేశాడనేగా మీ సందేహం. అది వాళ్లకే తెలీదంట. మొత్తం మీద మేథ్యూది ఖరీదైన హాబీనే!

దేశాల పేర్లు తెలపండి

పిల్లలు ఈచిత్రంలో వివిద దేశాలకు సంబంధించిన అద్భుతమైన కట్టడాలను ఇవ్వడం జరిగింది. అవి ఏయే దేశాలకు చెందినవో గుర్తించి? వాటి పేర్లను తెలపండి?



జవాబులు:ఆస్ట్రేలియా, అమెరికా, రష్యా, ఫ్రాన్స్, గ్రీస్, ఇంగ్లండ్

పదాలు గుర్తించండి

ఈ చిత్రంలో చాలా అక్షరాలు దాగున్నాయి. అయితే ఈ చిత్రం దిగువన కొన్ని పదాలు ఇవ్వడం జరిగింది. వాటి ఆధారంగా పదాలను గుర్తించండి.

ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ షార్ట్ ఫిల్మ్ All your education goes useless when you forget dignity of labour అనే క్యాప్షన్‌తో ప్రారంభం అవుతుంది. నిరుద్యోగులైన యువకులకు ఒక సందేశాన్ని ఇచ్చే చిన్న పాయింట్‌తో ఈ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మీద ఉన్న భ్రమతో గచ్చిబౌలి చేరుకుని, చదివిన చదువుకు తగిన ఉద్యోగం దొరక్క ఇబ్బంది పడేవాళ్లకు ఈ షార్ట్ ఫిలిం కనువిప్పు కలిగిస్తుంది. ఈ లఘుచిత్రం మొత్తం మూడు పాత్రల చుట్టూనే తిరుగుతుంది. నిరుద్యోగమనే సీరియస్ అంశానికి కాస్తంత హాస్యాన్ని జోడించి ఆసక్తికరంగా మలిచారు. 18 నిమిషాల నిడివి గల ఈ ఫిల్మ్ ఈనెల 11వ తేదీన యూట్యూబ్‌లో పెట్టారు. ఈ చిన్న సినిమాను రెండు రోజుల్లో చిత్రీకరిస్తే, యూట్యూబ్లో పెట్టిన వారం రోజులకే 30 వేలకు పైగా హిట్స్ వచ్చాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు చిరునామా గచ్చిబౌలి. దాన్నే సినిమా టైటిల్‌గా పెట్టుకుని మంచి ప్రయత్నం చేశారు గిరీశ్. రాత్రంతా కుక్కల్ని పట్టుకుంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంగా బిల్డప్ ఇచ్చే జంబులింగం, గచ్చిబౌలిలో చేసేదే ఉద్యోగం, సాఫ్ట్‌వేర్‌లో ఇచ్చేదే జీతం అని నమ్మే తన తల్లి కళ్లలో ఆనందం చూడ్డం కోసం గచ్చిబౌలి వచ్చి ఎలాంటి ఉద్యోగం దొరక్క ఆటో నడుపుకునే మరో నిరుద్యోగి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ... తండ్రికి ఆరోగ్యం బాగోలేకపోయినా వెళ్లలేక, వెళితే ఉద్యోగం ఎక్కడ ఊడుతుందోననే ఆందోళన ఒత్తిడికి గురయ్యే సగటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ప్రతినిధిగా ఒకరు... ఈ మూడు పాత్రలు వాస్తవ జీవితాన్ని కళ్లముందుంచుతాయి. ఈ చిన్న సినిమా ప్రారంభంలోనూ ముగింపులోనూ శ్రీజ వాయిస్ ఓవర్ బాగుంది. 'సాఫ్ట్ వేర్ అంతా ఉత్త బిల్డప్ బ్రో...', 'తొందరగా ఉద్యోగం అంటే... ఎట్ట చెబ్తాం.. చిరంజీవి 150 సినిమా అయ్యే లోపు అయిపోవచ్చు... అంటే, ఆయనెప్పుడు తీస్తాడో..', 'ఆదివారం ఒక్కరోజు తడిపి ఆరోజులు పిండుకుంటున్నారు' వంటి పంచ్ డైలాగ్‌లతోపాటు ఎడిటింగ్, సంగీతం కూడా బాగున్నాయి.

ఉన్న ఉద్యోగాల కన్నా ఎక్కువమంది ఉద్యోగాలు అడుక్కుంటున్నా, అందరికీ ఏదోక దారి చూపించే ప్రయత్నం చేస్తుంది, పాపం సాఫ్ట్‌వేర్. ఒకడికి నీ ముందుకొచ్చి నీకు ఉద్యోగం ఇయ్యట్లేదు అంటే... వాడి మొహానికో సెల్యూట్ కొట్టి, వాడి చేతికో షేక్‌హ్యాండ్ ఇచ్చి, థ్యాంక్స్ చెప్పి బయటికొచ్చి మనకొచ్చిన దాంట్లో, మనకున్నదాంట్లో, తెలివే మొదటి పెట్టుబడిగా పని మొదలు పెడితే.. మన దేశంలో చిన్న బతుకులు బాగుపడతాయి. 'వేరొకరిని అడుక్కు తినడం తప్పు, ఇంకొకరిని దొబ్బుకు తినడం నేరం. కానీ నిజాయితీగా ఒక ప్రయత్నం చేసి దెబ్బలు తినడం మాత్రం అదో గౌరవం, గర్వం'.. అన్న డైలాగ్‌తో సినిమా ముగుస్తుంది. చివరలో 'ఎక్కడ నుండి ప్రయాణం మొదలు పెట్టామో అది మర్చిపోకూడదు అని అంటారు... అందుకే మళ్లీ చెబుతున్నాము...' అంటూ మరో క్యాప్షన్ చూపిస్తారు.

శ్రమపై ఉన్న గౌరవాన్ని మర్చిపోతే ఎంత చదివినా వృధానే. తెలివినే పెట్టుబడిగా పెట్టి కష్టపడితే ఆటో నడుపుకుని అయినా బతకొచ్చుననే సందేశమిచ్చే ఈ షార్ట్‌ఫిల్మ్‌ను గిరీశ్ దర్శకత్వంలో పర్వతనేని రాంబాబు నిర్మించారు.

- రాజాబాబు కంచర్ల

ఆహ్వానం

యూ ట్యూబ్‌లో వేలాది లఘు చిత్రాలు హల్‌చల్ చేస్తుంటాయి. చైతన్యం కలిగిస్తాయి. ఆలోచన రేకెత్తిస్తాయి. మూఢ నమ్మకాలపై కనువిప్పు కలిగిస్తాయి' అనుకున్న షార్ట్ ఫిల్మ్ గురించి రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: స్నేహ, షార్ట్ ఫిల్మ్, హౌస్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2

ఇ-మెయిల్: snehaweekly.praja@gmail.com

బొద్దుగుమ్మ యోగా

కొస్త లావుగా వుంటే చాలు. 'ఈ భారీకాయంతో ... ఏమీ చేయలేం. ఏదీ సాధించలేం. ఏం చేయాలన్నా...సాధించాలన్నా కొవ్వు కరిగించాల్సిందే. సన్నజాజి తీగలా కావాల్సిందే' అనుకుంటాం. ఇదిగో ఈ శాన్‌ఫ్రాన్సిస్కో అమ్మడు 'వలెరై సాగున్' కూడా అచ్చు అలాగే అనుకునేది ఒకప్పుడు. నేస్తాలు స్కై డైవింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సాహస క్రీడల్లో పాల్గొంటుంటే... చూసి సంతోషించడమే కాక... మెచ్చుకునేది కూడా. అయితే నాలుగేళ్ల కిందట యోగా ప్రారంభించాక ఆమె ఆలోచనలు పూర్తిగా మారిపోయాయ్. కఠినమైన ఆసనాలు వేయడానికి కూడా ఏమాత్రం వెనకాడేది కాదు. వాటిని సాధించి చూపించి ఆశ్చర్యపరచి ఆనందించడం మొదలెట్టింది. అంతటితో ఆగలా! తను వేసిన యోగాసనాల ఫొటోలను సోషల్ మీడియాలో వుంచనారంభించింది. ఇహ చూస్కోండి. 80,000 మంది ఫాలోవర్లు ఏర్పడ్డారు. వారి అభినందనలు అందించిన స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా చేస్తోంది యోగా. బొద్దుగా వున్న వారికి చక్కటి సందేశం కూడా ఇస్తోంది. "ప్రతి ఒక్కరం లావుగానో..సన్నగానో వుంటాం. అలాగని బాధపడుతూ కూర్చోకూడదు. ముందుగా మన శరీరాన్ని మనం ప్రేమించడం నేర్చుకోవాలి. అప్పుడే ఏదైనా సాధించగలం". ●

ఫరీదా కాల్హో
జేన్ గుడాల్

రియాలిటీ బొమ్మలు

రాబెర్టా బొండార్

వారిస్ డైరీ

సిండ్రెల్లా, మిక్కీ మౌస్, సూపర్‌మేన్ బొమ్మలతో ఊహా లోకంలో చక్కర్లు కొడుతుంటారు చిన్నారులు. బొమ్మలన్నింటినీ పోగేసి వాటి ముచ్చట్లలో పడిపోతారు. ఎంత కలిసి సాగినా వాటి కబుర్లన్నీ ఊహాలేగా.. అదే నిజ జీవిత హీరోల్ని బొమ్మల రూపంలో దగ్గర చేస్తే ఆ వాస్తవికత మీ పసిపాపల్లో గొప్ప మార్పును తెస్తుందంటోంది సొంజ సింగ్. ఛాందసులతో పోరాడి ఆడపిల్లలతో పలకా బలపం పట్టిస్తున్న పాకిస్తాన్ సాహస బాలిక మలాలా, అంతరిక్షాన అడుగిడి స్ఫూర్తి నింపిన తొలి కెనడా మహిళా వ్యోమగామి రాబెర్టా బొందార్, 'హారీ పోటర్' నవలను ప్రపంచ చిన్నారులకు బహూకరించిన బ్రిటిష్ రచయిత్రి జె.కె.రౌలింగ్, పేదరికంలో పుట్టి పెరిగి మోడల్‌గా, రచయిత్రిగా మారిన సోమాలియా యువ కెరటం వారిస్ డైరీ, మెక్సికన్ చిత్రకారిణి ఫరీదా కాహ్లో ... వంటి వారి బొమ్మల్ని రూపొందించి వ్యక్తిత్వ వికాసానికి బొమ్మల కొలువుని ఎంచుకుంది. కామిక్, కార్టూన్ బొమ్మల భాగాల్నే సరిచేసి ట్రీ చేంజ్ డాల్స్ శ్రేణితో వాటిని మార్కెట్లోకి తెస్తోంది. చిన్నప్పటి నుంచే గొప్ప వ్యక్తులతో స్నేహం కుదిర్చే ఈ బొమ్మలు పెద్దయ్యాక కచ్చితంగా ప్రేరణగా నిలుస్తాయని సొంజా అంటోంది. తన పిల్లలు రియల్ హీరోల బొమ్మలతో తిరుగుతుంటే గర్వంగా ఉంటోందని ఆమె చెబుతోంది. పాయింట్ ఉంది కదండీ. ●

జె.కె.రౌలింగ్
మలాలా